భూపాలపల్లి లో పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు

పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం
పోలీసుల విధులు ఆయుధాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

జయశంకర్ భూపాలపల్లి , అక్టోబర్ 23(వుదయం జిల్లా ప్రతినిధి)

భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, ఆయుధాల వినియోగం, ఆధునిక సాంకేతిక పరికరాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్‌ప్రింట్ వ్యవస్థ, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, పనితీరును పోలీస్ అధికారులు వివరించారు. ఏకే47, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 9 ఎంఎం పిస్టల్ తదితర ఆయుధాలను ప్రదర్శించి, వాటి గురించి అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే విధానం, దర్యాప్తు ప్రక్రియ, అత్యవసర సమయాల్లో డయల్ 112 ద్వారా పొందగలిగే సేవలను వివరించారు.అదేవిధంగా సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. సాంకేతిక పరికరాల పనితీరును ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.సైబర్ నేరాల బారిన పడినప్పుడు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని,అత్యవసర పోలీస్ సహాయం కోసం డయల్ 112ను సంప్రదించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై అవగాహన

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

గ్రాడ్యుయేట్లందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పిలుపునిచ్చారు భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన, జనరల్ మేనేజర్‌ను,కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూవరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ భాగస్వాములు కావాలన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు నమోదుకు గడువు ఉన్నందున చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రాధాన్యతను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి, సింగరేణి కార్మికుల క్వార్టర్స్‌తో పాటు 5, 6, 7, 24వ వార్డుల్లో ప్రజలను కలుస్తూ ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో సుమారు 5,000 మంది వరకు గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకున్నట్లు సమాచారం ఉందని, .ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకొని రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై పట్టభద్రులకు పార్టీ నేతలకు అవగాహన

ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు.

ఖానాపురం, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై పట్టభద్రులకు పార్టీ నాయకులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించినట్లు నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు తెలిపారు. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలోని పట్టభద్రులు త్వరగా ఓటు నమోదు చేసుకోవాలని తెలుపుతూ,ఓటు నమోదు కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంసీ వైస్ చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని నాయకులకు ఇన్చార్జిలకు తెలుపుతూ, ఓటు నమోదుపై పట్టభద్రులకు నాయకులకు అవగాహన కల్పించి, గ్రామంలోని అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల మండల కోఆర్డినేటర్ కోడి మల్లేష్, సోషల్ మీడియా ఇన్చార్జ్ నాంచారి కుమారస్వామి, సొసైటీ పర్సన్ శివరాత్రి వెంకన్న,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.కె కమలుద్దీన్,నాయకులు తేజావత్ మిత్యా ఎద్దు మహేందర్, ఆబోతు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన పట్టభద్రులు నవంబర్ 6లోపు ఓటరుగా నమోదుకు చేసుకోవాలి.

ఘనంగా కొండ మురళి జన్మదిన వేడుకలు

వీరాభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు.

పరకాల అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

ప్రముఖ నాయకుడు కొండ మురళి జన్మదినాన్ని పురస్కరించుకొని పరకాల పట్టణంలో ఆయన వీరాభిమానులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తమ అభిమాన నాయకుడి పై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకుంటూ అభిమానులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొండ మురళి అభిమానులు జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలతో మమేకమై అభిమానుల ఆదరణ పొందుతున్న కొండ మురళి మరిన్ని విజయాలు సాధించాలని, ఆయు రారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అభిమానులు ఆకాంక్షించారు.వీరాభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కొయ్యల అనిల్ కుమార్, రాస రాజేష్, పెరుమండ్ల నిఖిల్, పోషాల ప్రవీణ్, సాధు దిలీప్ తదితరులు పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు. కొండ మురళిపై తమకున్న అభిమానాన్ని చాటుకుంటూ

తన పేరుని చేతి పై పచ్చ బొట్టు రూపంలో వేసుకొని ఆయన జన్మదినాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొత్తగూడలో ఉచిత కంటి వైద్య శిబిరం

మూడో విడతలో 13 మందికి కంటి శస్త్రచికిత్సలు..
ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

కొత్తగూడ అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కొత్తగూడ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సూర్య స్వచ్ఛంద సేవా ట్రస్ట్, మహబూబాబాద్ రెడ్డి బజార్‌లోని సూర్య కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రశంసా పత్ర గ్రహీత, లయన్స్ క్లబ్ ప్రతినిధి, ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ అడ్డిచర్ల మాధవరావు అధ్యక్షత వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా మూడో విడతలో శుక్రవారం 13 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారు. అనంతరం వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. మొదటి విడతలో 26 మందికి, రెండో విడతలో 18 మందికి ఇప్పటికే విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ అడ్డిచర్ల మాధవ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కంటిలో పొరలు ముదిరి చూపు మందగించిన వారిని గుర్తించి, ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆధునిక వైద్య పద్ధతుల్లో శస్త్రచికిత్సలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి దివాకర్, సూర్య కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ

గ్రామాల వారీగా పంటల పరిస్థితిని అంచనా వేయాలి.

మండల ప్రత్యేక అధికారి ఎన్. నీరజ

పర్వతగిరి , అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని మండల అధికారులను అధికారులను మండల ప్రత్యేక అధికారి ఎన్. నీరజ ఆదేశించారు. పర్వతగిరి మండలం ఎంపీడీఓ సమావేశం వేదికలో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాల వారీగా పంటల పరిస్థితి, నీటి లభ్యతపై సమగ్ర అంచనా వేయాలని సూచించారు. నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను, పంటలు ఎండిపోయే పరిస్థితులున్న గ్రామాలను క్షేత్రస్థాయిలో గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి,సాగునీటి వనరుల లభ్యతకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, రానున్న వ్యవసాయ సీజన్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. వాతావరణ అంచనాలను నిరంతరం పరిశీలిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు అందిస్తూ, పంట నష్టాన్ని నివారించేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ బాలోత్ శంకర్ నాయక్ , డిప్యూటీ తహసీల్దార్ ఎంపీవో శేషు , మండల వ్యవసాయ అధికారి శశికాంత్, ఆర్టికల్చర్ అధికారి , వెటర్నరీ డాక్టర్ , విద్యుత్ శాఖ ఏడి తిరుపతి , పంచాయతీరాజ్ డిఈ , ఏఈ ,ఆర్ బ్లూఎస్ డిఈ , ఏఈ, వివిధ శాఖల అధికారులు ,గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల కంటి వెలుగుకు సర్పంచ్ చేయూత

కాట్రపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం60 మందికి కంటి పరీక్షలు..
ఆపరేషన్లకు వెళ్లేవారికి ఉచిత రవాణా, భోజన వసతి

రాయపర్తి అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

మండలంలోని కాట్రపల్లి గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కాట్రపల్లి గ్రామ సర్పంచ్ రాపాక పద్మబ్రహ్మచారి చొరవ తీసుకున్నారు.శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్, హనుమకొండ వారి సహకారంతో గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 60 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు.గతంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో సర్పంచ్ మరోసారి స్పందించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి మరోసారి శిబిరాన్ని ఏర్పాటు చేయించారు.ఆపరేషన్లకు వెళ్లేవారికి ప్రత్యేక సహాయంకంటి ఆపరేషన్లు అవసరమైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సర్పంచ్ తన సొంత ఖర్చులతో రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంతో పాటు భోజన వసతి కూడా కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో సర్పంచ్ తీసుకున్న ఈ చొరవ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని, అవసరమైన వారికి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

వివిధ రకాల వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నేటి నుంచి కుష్టువ్యాధిపై అవగాహన ఇంటింటి సర్వే.
పిహెచ్సిని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్వో ప్రకాష్.

ఖానాపురం, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

ఎల్ నినో ప్రభావం వల్ల రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో వివిధ రకాల వ్యాధులు ప్రజలకు సోకే అవకాశం ఉన్నందున వ్యాధులు ప్రజలకు శోకకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీడిఎంహెచ్వో బండ ప్రకాష్ తెలిపారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్వో సందర్శించి రికార్డులను వైద్య సిబ్బంది హాజరు పట్టికను ఆసుపత్రిలో ఉన్న మందులను పరిశీలించారు.అలాగే ఈనెల 24 నుండి జాతీయ కుష్ఠి నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య బృందానికి తెలిపారు. నేటి నుండి 14 రోజులపాటు కుష్ఠు వ్యాధిపై అవగాహన ప్రతి ఇంటిని సందర్శించి సర్వే నిర్వహించాలని తెలిపారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించి మిషన్ ఇంద్రధనస్సు వ్యాధి నిరోధక టీకాల అమలు విధానాన్ని పరిశీలించారు,కుష్ఠు వ్యాధికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు అందజేస్తారని తెలుపుతూ, కుష్ఠువ్యాధి పట్ల ప్రజలు భయాన్ని విడనాడాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ జ్యోతి, సబ్ యూనిట్ ఆఫీసర్ నంద , వైద్య సిబ్బంది శ్రీనివాసచారి,దేవిక,చిన్ని, సబిత, ప్రతిభ , భాస్కర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అరురి రమేష్

పర్వతగిరి , అక్టోబర్ 23 (వుదయం విలేకరి):

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పిలుపునిచ్చారు శుక్రవారం పర్వతగిరి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆరురి రమేష్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, తమ పరిధిలోని ప్రతి గ్రాడ్యుయేట్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు.అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకునేలా కృషి చేయాలని, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకునేలా చొరవ చూపాలని కోరారు. ఈ ప్రక్రియను బాధ్యతగా నిర్వహిస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గం పట్టపద్రుల ఓటర్ల నమోదు ఇన్చార్జి సయ్యద్ మసూద్ , బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు , మాజీ పిఎస్ఎల్ చైర్మన్ మనోజ్ కుమార్ గౌడ్ , మాజీ ఏం సి డైరెక్టర్ పట్ట పురం ఏకాంతం గౌడ్ , మాజీ జడ్పిటిసి లూనావత్ పంతులు , మాజీ మండల రైతు బంధు అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్ , మాజీ ఎంపీటీసీలు , మాజీ సర్పంచులు , మండల నాయకులు , పట్టబద్రుల ఓటర్ల నమోదు ఇన్చార్జిలు , తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఓట్లు కావాలి కానీ ప్రశ్నించకూడదా

మహిళా అధ్యక్షురాలు కేదారి గీత

మహాదేవపూర్, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓట్లతో గెలుపొందినపుడు ప్రజలు ప్రశ్నించకూడదా అని మంథని నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కేదారి గీత భాయ్ శుక్రవారం ప్రకటనలో ప్రశ్నించారు. మహాదేవపూర్ దసరా ఉత్సవాలపై మాట్లాడిన పెద్దాయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజలకు ప్రశ్నించే నైతిక విలువ లేదనడం ప్రజాస్వామ్యాన్నే అవమానించడమేనని తెలిపారు. ప్రజాస్వామ్యంలో తప్పులు జరిగితే ప్రజలు ప్రశ్నించరా అని పేర్కొన్నారు దసరా ఉత్సవాల పేరుతో రికార్డింగ్ డ్యాన్సులు పెట్టి గ్రామ ప్రతిష్టను దిగజార్చినప్పుడు ప్రజలు ప్రశ్నించరా? మంత్రి తమ్ముడి రాక కోసం రావణ వధ రెండు గంటలు ఆలస్యం చేసి వేలాది మంది ప్రజలను ఇబ్బంది పెట్టినప్పుడు ప్రజలు ప్రశ్నించరా అంటూ తెలిపారు.కూలీలు, చిన్న చిన్న దుకాణదారుల దగ్గర కూడా బలవంతంగా చందాలు వసూలు చేస్తే నిలదీసే అధికారం ప్రజలకు ఉంటుందని గమనించాలని తెలిపారు. ఎన్నికలప్పుడు ప్రజల ఓట్లు కావాలి, కానీ తప్పు జరిగినప్పుడు ప్రశ్నించే నైతిక హక్కు ప్రజలకు ఉండదా? అని ప్రశ్నించారు. ఓటు వేసే హక్కు ఉన్న ప్రజలకు,తమ సొమ్ము ఎక్కడ ఖర్చయిందో, తమ పండుగ ఎలా జరిగిందో ప్రశ్నించే పూర్తి నైతిక హక్కు ఉందని, ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్ళు అనే విషయం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజలకు స్థాయి లేదని మాట్లాడటం సరికాదని,ప్రజల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని,అక్రమాలు జరిగితే ప్రశ్నించే ప్రజలను నైతిక హక్కు లేదని అంటూ ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడడం అధికార పార్టీకి చెందిన నాయకుడు మానుకోవాలని హెచ్చరించారు.

మల్య తండా గడ్డపార తండా భూక్య భాస్కర్ అంతిమయాత్ర

కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు
కాంటెస్ట్ జెడ్పిటిసి జాటోత్ శ్రీనివాస్ నాయక్

పర్వతగిరి , అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండలం గ్రామం మల్లె తండా గడ్డపార తండా జిపి సిబ్బంది అనారోగ్యంతో మరణించిన అంతిమయాత్రలో పాల్గొన్న బొంపెల్లి దేవేందర్ రావు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు భూక్య భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించి మనోధర్యం కల్పించి వారికి ఆర్థిక సాయం చేసినాడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ కాంటెస్ట్ జెడ్పిటిసి మాట్లాడుతూ భూక్య భాస్కర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా అన్ని విధాల సాయం అందజేస్తామని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చినాడు అంతిమయాత్రలో పాల్గొన్న భూక్య మంజుల శ్రీనివాస్ సర్పంచ్ మల్లె తండా తొర్రి పద్మ యాదవ్ ఏసుగల్ సర్పంచ్ ఉప సర్పంచ్ ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బూత్ కన్వీనర్లు గ్రామ పెద్దలు గ్రామవాసులు పాల్గొన్నారు

నీటి నిల్వలను పరిరక్షిద్దాం..

ప్రభుత్వం వారికి చిన్న విన్నపం ప్రజలకు నీటి గుంటలపై అవగాహన కల్పించాలి ప్రస్తుత పరిస్థితులలో కొన్ని సంవత్సరాలు దాదాపు అతి త్వరలో నీటి నిలువలు కిష్ట పరిస్థితిలో రావడం జరుగుతుందని శాస్త్రవేత్తలు విన్నవిస్తున్నారు. దీన్ని ఎదుర్కొనడానికి ప్రజలు మనమే మమేకమై కొద్దిగానైనా రక్షించడానికి ప్రయత్నం చేయడం అవసరం ఉందని నా అభిప్రాయం. ముఖ్యంగా గ్రామాలలో ప్రజలందరూ వాడే నీటిని అన్ని ఇండ్లలో వాడిన నీరు అందుబాటులో ఉన్న చోట పెద్ద పెద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి ఆ నీటిని మొత్తం ఇంకుడు గుంటలోకి పంపడానికి ప్రయత్నం చేయవలసిన అవసరం గ్రామ సర్పంచ్ మరియు అక్కడి సిబ్బంది ప్రజలతో మమేకమై చేయడం వల్ల కొద్దిగా మనము రక్షించుకోవడానికి అవకాశం ఉంటుంది. దీనిపై ప్రభుత్వం వారు అన్ని గ్రామ సర్పంచులకు వివిధ శాఖల పరిస్థితులను బట్టి దీనిపై ఒక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తే ప్రజలలో దీనిపై ఒక మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. అలాగే ఇటువంటి ఏర్పాటు చేసిన వారికి ప్రోత్సా బహుమతులు కూడా ఏర్పాటు చేస్తే ఇంకా గ్రామ ప్రజలు అందరూ ముందుకు రావడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. గ్రామాల నుంచి పాటు పట్టణాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసిన ఇంటి పనుల్లో కొద్దిగా రాయితీ ఇస్తామని ప్రకటిస్తే ప్రతి ఒక్కరు ముందుకు రావడానికి అవకాశం ఉంటుంది దీనిపై ప్రభుత్వ వారు విధిగా ప్రజలలో వివిధ కళాకారులతో ప్రదర్శిస్తూ ప్రజలకు ఆకట్టుకునే విధంగా చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఇప్పుడు కట్టే ఇళ్లకు విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినప్పుడే ఇంటికి కట్టుకోడానికి పర్మిషన్ ఇవ్వడం అలాగే నల్ల కనెక్షన్ ఇవ్వడం కరెంటు కూడా ఇవ్వడం అనేది వివరించాలి.అపార్ట్మెంట్లో కూడా ఇది వర్తించేలా ఏర్పాటు చేయాలి. అలాగే ప్రతి నీటి చుక్కను వినియోగపరుచుకునే విధంగా ప్రజలు రావడానికి కల్పిస్తూ ప్రజలతో మమేకమై ఈ నీటి ఇద్దరిని నివారిద్దాం. ఉదాహరణకు 1000 చదరపు అడుగుల ఇంటి విస్తీర్ణం పై పడే వర్షం నీరు సుమారు 2000 లీటర్ల నీరు సేకరించవచ్చు.ఆ నీరు డైరెక్ట్ గా పైపుల ద్వారా ఇంకుడు కుంట లలోకి అంత నీరు ఆదా అవుతుంది.

డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్
సామాజికవేత్త, భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

ప్రజలకు నైతిక విలువలు లేవంటూ ఓట్లు అడగండి చూద్దాం

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకుల ఫైర్

భూపాలపల్లి , అక్టోబర్ 23 (వుదయం విలేకరి):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని తాము కోరినందుకు ప్రజలకు నైతిక విలువలు లేవంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వ్యాఖ

మాజీ మంత్రి హరీష్ రావు గారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన

ఎమ్మెల్యే మాణిక్ రావు,మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఝరాసంగం అక్టోబర్:23(వుదయం ప్రతి నిధి)

దసరా పండుగను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని గౌరవ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు గారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన జహీరాబాద్ ఎమ్మెల్యే శ్రీ కొనింటి మాణిక్ రావు గారు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ గారు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప,మాజీ సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ ,మాజీ ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం,కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు,జహీరాబాద్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ లు, నాయకులు, కోహీర్ పట్టణ కౌన్సిలర్ లు, నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు.కలవడం జరిగింది.

హరీష్‌రావును కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నేతలు

కోహీర్, అక్టోబరు 23 (వుదయం ప్రతినిధి): విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు నేతృత్వంలో కోహీర్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు మాజీ ఆరోగ్యశాఖ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి. హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కోహీర్ బి.ఆర్.ఎస్.నాయకుల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్, 11వ వార్డు కౌన్సిలర్ ఎం.ఏ. కలీమ్, బీఆర్ఎస్ కోహీర్ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ అఖీల్ సహా పలువురు నాయకులు హరీష్‌రావును కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి, శ్రేయస్సుతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.దసరా పండుగ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించాలని నాయకులు పేర్కొన్నారు. పండుగను పురస్కరించుకుని నాయకుల మధ్య ఆత్మీయతను చాటుతూ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కోహీర్ మండల అధ్యక్షుడు నర్సిములు యాదవ్, కౌన్సిలర్ చంద్ ఖురేషి, సంపత్ కుమార్, కౌన్సిలర్ల ప్రతినిధులు అస్లాం జైద్, అజహర్ ఉద్దీన్, వహీద్ సర్వర్, సందీప్ కుమార్, జగదీష్, ఖలీల్, అఫ్ఫర్ షన్ను, సిరాజ్ ఉద్దీన్, మతీన్ ఇమ్రాన్, ఆదిల్, మొహమ్మద్ అహసన్, ఉస్మాన్, ఆతిఫ్, ఓమాన్, మహేందర్, ధన్‌రాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మద్దిమడుగు బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి): నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి మద్దిమడుగు దేవస్థానం వార్షిక కార్తీక మాస బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు.పదర మండలంలోని మద్దిమడుగు క్షేత్రంలో ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాలాధారణ, బ్రహ్మోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు తాగునీరు, నిత్యాన్నదానం, క్యూలైన్లు, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సౌకర్యాల్లో ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఈఓ, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

రెండోసారి ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన చంద్రశేఖర్‌కు సన్మానం

సంగారెడ్డి వుదయం : జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా రెండోసారి ఎన్నికైన చంద్రశేఖర్‌ను సంగారెడ్డి జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం నాయకులు పట్లోళ్ల నాగేశ్వర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సాగుభూమి సంరక్షణపై రైతులకు అవగాహన

నేల ఆరోగ్య పరిరక్షణతోనే నికర ఆదాయం సాధ్యం

మిరుదొడ్డి , అక్టోబర్ 23, వుదయం: సాగుభూమి సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కేతి బచావ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మిరుదొడ్డి రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నీరు, ఎరువులు, సస్యరక్షణ ఖర్చులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయంలో నికర ఆదాయం పెంచుకోవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. దుబ్బాక డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మల్లయ్య, వ్యవసాయ అధికారి బి. మల్లేశం మాట్లాడుతూ, సాగుభూమి సంరక్షణకు సంబంధించిన 12 అంశాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి సమర్థ వినియోగం, ఎరువుల పొదుపు, సస్యరక్షణ చర్యలను పద్ధతి ప్రకారం చేపట్టడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి వంటల సాగు ప్రాముఖ్యతను వివరిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, సాగులో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు లోహిత్, అఖిల్, రేఖతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల్లో టిహెచ్ఆర్ సరుకుల పంపిణీ

మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం ఎంతో ముఖ్యం

లింగరాజుపల్లి సర్పంచ్ పోతరాజు ప్రకాష్

దౌల్తాబాద్, అక్టోబర్ 23 (వుదయం): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాల్లో భాగంగా దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగరాజుపల్లి గ్రామంలో టేక్ హోమ్ రేషన్ (టిహెచ్ఆర్) సరుకులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పోతరాజు ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయురాలు (హెచ్ఎం), సీఏ ఆశా చేతుల మీదుగా లబ్ధిదారులకు సరుకులు అందజేశారు.

పోషకాహారంతో ఆరోగ్యకరమైన సమాజం

ఈ సందర్భంగా సర్పంచ్ పోతరాజు ప్రకాష్ మాట్లాడుతూ.. మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లులు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకొని, పిల్లలకు అవసరమైన పోషకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

బతుకమ్మ వేళ సంక్షేమ కార్యక్రమాలు

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని ప్రకాష్ పేర్కొన్నారు. పండుగ సంబరాలతోపాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని తెలిపారు. గ్రామంలో అంగన్‌వాడీ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేస్తూ, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను తగ్గించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతరాజుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయురాలు, సీఏ ఆశా, సంబంధిత సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపేందుకే భూ రీ సర్వే....

ఏడి కిషన్ ఆర్డిఓ రామకృష్ణ...

వుదయం న్యూస్ శివ్వంపేట అక్టోబర్ 23.....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో శివ్వంపేట తాసిల్దార్ కమలాద్రి ఆధ్వర్యంలో భూముల రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడి కిషన్. ఆర్డీవో రామకృష్ణ విచ్చేసి కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం గురించి వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం భూ వివాదాలకు స్వాస్థ్యత పరిష్కారం చూపేందుకు భూభారతి చట్టం లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన సమగ్ర భూ రీ సర్వే ను ప్రారంభించింది. దాదాపు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో సాగు భూములపై జరుగుతున్న ఈ మెగా డిజిటల్ సర్వే కు సంబంధించిన ముఖ్యమైన విధివిధానాలను నిబంధనలు రైతులకు వివరించడం జరిగింది. రైతులు లేవనెత్తిన ప్రశ్నలకు వారు సమాధానాలు ఇస్తూ ప్రతి రైతు తమ భూమి సర్వే చేయించి తమ ఆధార్ కార్డుతో పాటు ఏదైనా ఆధారాలు ఉంటే జతపరిచి సర్వయారులకు ఇవ్వగలరు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు రికార్డుల నమోదుపై నోటీసులు ఇస్తారు రికార్డులో లేదా హద్దులతో ఏమైనా తప్పులు ఉంటే రైతులు భూదారులు తమ అభ్యంతరాలను తెలియజేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. అభ్యంతరాల పరిశీలన తర్వాతే రికార్డులను ఖరారు చేస్తారు. రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ మరియు సర్వే శాఖలను భూభారతి హోటల్ అనే ఒక డిజిటల్ ప్లాట్ఫారం పైకి తీసుకువస్తున్నారు. దీని ద్వారా భూ రికార్డుల ట్యాంపరింగ్కు అవకాశం లేకుండా 100% పారదర్శక సేవలు అందించడమే కాకుండా సరిహద్దు తగాదాలను స్వాసితంగా నివారించడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని వారు వివరించారు. రైతులు సర్వే చేసేటప్పుడు సర్వేలకు సహకరించి భూ సర్వే ను విజయవంతంగా పూర్తి అయ్యేటట్లు రైతులందరూ సహకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుణం గారి రాజు. ఉప సర్పంచ్ శ్రావణి ప్రవీణ్ గౌడ్. గౌరవ సభ్యులు సంజీవ్ కుమార్. ప్రవీణ్. పద్మ లింగం యాదవ్. మైసమ్మ మల్లేష్ యాదవ్. శ్రీనివాస్ గౌడ్. లక్ష్మీ నరసయ్య. జనార్దన్. మాజీ సర్పంచులు గ్రామ రైతులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జనగణనపై సమగ్ర అవగాహనతో విధులు నిర్వహించాలి: కలెక్టర్

నాగర్ కర్నూల్, అక్టోబర్ 22 (వుదయం బ్యూరో): జనగణన ప్రక్రియపై సమగ్ర అవగాహనతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు.

శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంఈవోలకు నిర్వహించిన రెండు రోజుల జనగణన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన, మౌలిక సదుపాయాల కల్పనకు జనగణన సమాచారం కీలకమని తెలిపారు. వివరాలను జాగ్రత్తగా పరిశీలించి కచ్చితమైన సమాచారం నమోదు చేయాలని, నిర్లక్ష్యం లేకుండా మార్గదర్శకాల ప్రకారం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కచ్చితత్వం, పారదర్శకత, సమన్వయంతో బాధ్యతలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో డీపీవో సుజాత, మాస్టర్ ట్రైనర్లు శివరామకృష్ణ, రిషిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

బిజినపల్లి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి): మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జెండర్ స్పెషలిస్ట్ సునీత అన్నారు.శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు ఉద్దేశించిన చట్టం-2013 రూపొందించారని, అనుచితంగా తాకడం, అసభ్య మాటలు, ఫోటోలు, ఒత్తిడి, ఇబ్బందికర చూపులు, సోషల్ మీడియాలో వేధింపులకు గురైతే సంక్షేమ అధికారిని సంప్రదించవచ్చని తెలిపారు.డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ మహిళలను గౌరవించడమే మన సంస్కృతిని గౌరవించడమన్నారు. ఏదైనా వేధింపులకు గురైతే 181 హెల్ప్ లైన్ కు ఫోన్ చేయవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి లలిత, ఆర్ఐ రాధ, జీపీఓలు కృష్ణవేణి, పార్వతి, ప్రసన్న, మంజుల, పార్థ, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలెం వెంకన్న ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ

బిజినపల్లి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని శ్రీ అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చుట్టూ నేటి నుంచి ప్రతి శనివారం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభమై, అనంతరం 7 గంటలకు స్వామివారి పల్లకి సేవ నిర్వహించనున్నారు.

ఏడు శనివారాల పాటు ఏడు ప్రదక్షిణలు చేయడం ద్వారా స్వామివారి అనుగ్రహంతో కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు పిలుపునిచ్చారు.

రబీలో వరి సాగు వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు!

రిజర్వాయర్లలో డెడ్ స్టోరేజీ.. రైతులు అప్రమత్తంగా ఉండాలి

గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, అక్టోబర్ 23 (వుదయం బ్యూరో)ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరడంతో రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వెబ్‌ఎక్స్ ద్వారా అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం పంట విస్తీర్ణం 3,19,470 ఎకరాలు ఉండగా, వరితోపాటు పత్తి, మిరప, వేరుశనగ, కంది తదితర పంటల సాగు పరిస్థితులపై సమీక్షించారు. వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ రైతులు ఖరీఫ్‌లో వరి సాగు చేశారని, ఆ వంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి వారబందీ విధానంలో కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

వరి సాగుతో భవిష్యత్తులో ఇబ్బందులు

రబీ సీజన్‌లో వరి సాగు చేయకుండా రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బోర్లు, బావుల్లో నీటి లభ్యతను పరిశీలించి, అందుబాటులో ఉన్న నీటికి అనుగుణంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా సూచనలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉన్నాయని, భవిష్యత్తులో ఈ సమస్యలు మరింత పెరిగితే పంటలను కాపాడుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు.

ఖేతి బచావో అభియాన్‌పై విస్తృత ప్రచారం

ఖేతి బచావో అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామసభల ద్వారా కరువు పరిస్థితులు, పంటల ఎంపిక, పశుగ్రాసం, ఉపాధి హామీ పనులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశాల్లో సర్పంచులు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి క్లస్టర్ పరిధిలోని గ్రామాల వారీగా సమావేశాల షెడ్యూల్ రూపొందించి జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పించాలని, రైతులకు పంపిణీ చేసేందుకు జిల్లా, మండల స్థాయిలో పంటల సాగు సలహా పత్రాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

నేల సారాన్ని కాపాడటంతోపాటు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని నియంత్రించేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా నేల పరీక్షలు చేయించి, అవసరమైన మోతాదులోనే ఎరువులు వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి రైతులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంతోపాటు నీటి సంరక్షణ, ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ పంటల నిర్వహణపై గ్రామస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. నకిలీ ఎరువులు, పురుగుమందుల పట్ల రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు.

నెల రోజులపాటు అవగాహన సమావేశాలు

ఖేతి బచావో అభియాన్‌లో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 30 సమావేశాలు నిర్వహించి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్పతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాత్కాలిక షాపులను తొలగించవద్దు

కొల్లూరు 2డీఎఖ వాసుల విజ్ఞప్తి

వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 23)

కొల్లూరు 2డీఎఖ ఫేజ్--2లోని తాత్కాలిక షాపులను తొలగించవద్దని కోరుతూ శుక్రవారం సీ.ఎం.సీ డిప్యూటీ కమిషనర్ కావ్యకు స్థానిక నివాసితులు వినతిపత్రం సమర్పించారు. ఈ షాపుల ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంటాయని, చిన్న వ్యాపారులకు జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. సొసైటీ ఎన్నికలు పూర్తయ్యే వరకు, అధికారులు సానుకూల నిర్ణయం తీసుకునే వరకు షాపులను తొలగించవద్దని బానోత్ కావ్య కోటేష్ నాయక్‌తో పాటు స్థానికులు, వ్యాపారులు విజ్ఞప్తి చేశారు.

బదిలీపై వెళ్తున్న మాగనూరు ఎస్సై అశోక్ బాబుకు సన్మానం

మాగనూర్ అక్టోబర్ 23 (వుదయం న్యూస్)మాగనూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి నిబంధనతో ప్రజాసేవలో ముందుకు సాగి క్రమశిక్షనే కవచంగా న్యాయమే లక్ష్యంగా ప్రజల గుండెల్లో గౌరవాన్ని సంపాదించిన మీకు వందనం బదిలీపై గద్వాల జిల్లా ఎస్సీ కార్యాలయం (వీఆర్) వెళ్తున్న అశోక్ బాబు సార్ గారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వడ్వాట్ మాజీ సర్పంచ్ నర్సింహులు... దుపల్లి ఆశప్ప సర్దార్ నర్సింహులు అమ్మపల్లి సర్పంచ్ నర్సింహులు గణేష్ ఆటో రవికుమార్ గోవర్ధన్ బసంత్ రెడ్డి పాల్గొన్నారు..

కష్టార్జితానికి కష్టకాలం: భద్రత ఏదీ .. భరోసా ఎవరిది?!

- **బ్యాంకులో సైబర్ ఉచ్చు.. ఇంట్లో దొంగల పిడుగు: సామాన్యుడి సొమ్ముకు భద్రత ఏదీ?!**
- **రక్తస్వేదానికి రక్షణ కరువు: కష్టపడితే కడుపుకోత.. దాచుకుంటే దోపిడీ!**
- **డిజిటల్' మాయాజాలం.. 'చేతి నగదు'కూ చోరీల భయం: సామాన్యుడి పొదుపుపై సైబర్ పంజా!**

గద్వాల, అక్టోబర్ 23 (వుదయం బ్యూరో) :రెక్కలు ముక్కలు చేసుకుని.. ఒంటి చెమటను ధారపోసి కూడబెట్టిన వ్రతి రూపాయికీ ఇవ్వుడు అడుగడుగునా అభద్రతాభావమే రాజ్యాంగం ఏలుతోంది! రాత్రింబవళ్లు శ్రమించి భవిష్యత్తు అవసరాల కోసం, పిల్లల చదువుల కోసం, వృద్ధాప్య ఆసరా కోసం దాచుకున్న ఆ కొద్దిపాటి సొమ్మును కాపాడుకోవడం సామాన్యుడికి కత్తి మీద సాములా మారింది. ?బ్యాంకులో దాచుకుంటే సైబర్ నేరగాళ్ల వక్రకన్ను.. ఇంట్లో ఉంచుకుంటే దొంగల భయం.. కష్టపడి బంగారంగా మారుద్దామంటే చోరీల కలవరం! మరి, ఈ దేశ పునాది అయిన సామాన్యుడు తన కష్టార్జితాన్ని ఎక్కడ దాచుకోవాలి? ఎవరిని నమ్మి భద్రపరుచుకోవాలి? ఈ ప్రశ్నలు ఇప్పుడు ప్రతి సగటు పౌరుడి గుండెల్లో శూలాలై గుచ్చుకుంటున్నాయి. ?బ్యాంకు ఖాతాలూ సురక్షితం కావా? ?ఒకప్పుడు బ్యాంకులో రూపాయి జమ చేస్తే ప్రభుత్వమే పూచీ అని, అది ఎప్పటికీ పదిలంగా ఉంటుందనే అచంచలమైన నమ్మకం ప్రజల్లో ఉండేది. కూలి నాలీ చేసుకునేవారు, చిరు వ్యాపారులు, చిన్న ఉద్యోగులు తమ కడుపు కట్టుకుని మరీ బ్యాంకుల్లో సొమ్ము పొదుపు చేసుకునేవారు. కానీ, డిజిటల్ విప్లవపు వెలుగుల వెనుక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ.. సైబర్ నేరగాళ్ల వక్రబుద్ధి అంతకంతకూ విస్తరిస్తోంది. ?వాట్సాప్ లింకులు, నకిలీ యాప్‌లు, కేవైసీ అప్‌డేట్ పేరిట వచ్చే బెదిరింపులు, బ్యాంకు అధికారులమంటూ చేసే మాయ మాటల ఫోన్ కాల్స్.. ఇలా రకరకాల ఎత్తుగడలతో అమాయకుల జీవిత కష్టాన్ని క్షణాల్లో కొల్లగొడుతున్నారు. ఏళ్ల తరబడి కూడబెట్టిన సంపద రెప్పపాటులో మాయమైతే ఆ కుటుంబం పడే క్షోభ వర్ణనాతీతం. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన సొమ్ము గాల్లో కలిసిపోతే ఆ వృద్ధులకు దిక్కెవరు? పిల్లల భవిష్యత్తు కోసం కట్టుకున్న కలలు చెదిరిపోతే బాధ్యులెవరు? ?ఇంట్లో దాచుకుందామంటే.. చోరీల పిడుగు! ?బ్యాంకుల్లో డిజిటల్ మోసాలు పెరిగిపోతున్నాయనే భయంతో ఇంట్లో దాచుకుందామంటే అక్కడా ప్రశాంతత లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా పొంచి ఉండే చోరీలు, దొంగతనాలు, దోపిడీలు సామాన్యుడి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఇంట నగదు ఉందన్న చిన్న వార్త దుండగులకు చేరితే ఆ కుటుంబ ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కళ్లముందే కష్టార్జితం కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాల వ్యథలకు అంతులేకుండా పోతోంది. ?బంగారమూ భరోసానివ్వదే!?నగదును భద్రపరుచుకోవడం కష్టమని బంగారంగా మార్చుకుంటే సరిపోతుందనుకునేవారూ తక్కువేం కాదు. కానీ, నేటి పరిస్థితుల్లో ఇంట బంగారం ఉంచుకున్నా చోరీల భయమే! ఒంటిపై వేసుకుని బయటకు వెళ్లాలన్నా దుండగుల దాడుల కలవరం వెంటాడుతోంది. ఇక బ్యాంకు లాకర్లను ఆశ్రయిద్దామంటే భారీ అద్దెలు, క్లిష్టమైన నిబంధనలు సామాన్యుడికి మోయలేని భారమవుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా హెచ్చుతగ్గులకు లోనయ్యే బంగారం ధరలు.. అత్యవసర సమయంలో ఆశించిన భరోసానివ్వలేకపోతున్నాయి. ?పొదుపు చేయాలా? వద్దా? ?మనిషి జీవితంలో కష్టకాలం ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియదు. అందుకే 'రేపటి అవసరాల కోసం పొదుపు' అనేది మానవ సమాజంలో ఒక విడదీయరాని భాగం. కానీ, నేడు పొదుపు చేయాలంటే భద్రతా సందేహాలు.. దాచుకున్న సొమ్మును వాడుకోవాలంటే ఊహించని కొత్త సమస్యలు! ఈ సంక్షిష్ట వాతావరణంలో సామాన్యుడు ఏం చేయాలి? తన కుటుంబానికి భరోసా ఎలా కల్పించుకోవాలి? ?పోస్టాఫీసు పొదుపు పథకాలు, అర్హత కలిగిన బ్యాంకు డిపాజిట్లకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వరకు బీమా రక్షణ లభిస్తున్న మాట వాస్తవమే. కానీ, సైబర్ నేరాల ద్వారా కోల్పోయే సొమ్ముకు ఈ బీమా వర్తించదు. అందుకే నేటి పరిస్థితుల్లో అప్రమత్తతే తొలి ఆయుధం కావాలి. ఎవరికీ ఓటీపీలు, పిన్ నంబర్లు చెప్పకపోవడం, అపరిచిత లింక్లను క్లిక్ చేయకపోవడం ఎంత అవసరమో.. ఒకవేళ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ నేర హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయడం అంతే ముఖ్యం. ?వ్యవస్థల బాధ్యత ఎవరిది??డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం ఎంత ముఖ్యమో, ఆ డిజిటల్ మార్గాల్లో సామాన్యుడి సొమ్ముకు పూర్తి రక్షణ కల్పించడం ప్రభుత్వాలు, బ్యాంకింగ్ రంగాలు మరియు సైబర్ భద్రతా విభాగాల ప్రాథమిక బాధ్యత. కేవలం డిజిటల్ ఇండియా నినాదాలతో సరిపెట్టకుండా.. సైబర్ నేరాల కఠిన నియంత్రణ, బాధితులకు తక్షణ న్యాయం, గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన అమలు కావాలి. ?సామాన్యుడి చెమట చుక్కకు అసలైన విలువ అతడి పొదుపు సొమ్ము. దానికి రక్షణ కల్పించడమే పాలకుల ముందున్న అసలైన, అత్యున్నత సవాలు! భారీ వడ్డీలు కాదు.. తమ కష్టార్జితం పదిలంగా ఉంటుందనే నమ్మకమే ప్రజలకు కావాల్సింది. ఆ నమ్మకాన్ని, భరోసాని నిలబెట్టాల్సిన బాధ్యత వ్యవస్థలపైనే ఉంది!

మెజిస్ట్రేట్ గా ఎంపికైన అభ్యర్థికి ఘన సన్మానం

నారాయణపేట అక్టోబర్ 23(వుదయం ప్రతినిధి)

మెజిస్ట్రేట్ గా ఎంపి కైన నారాయణపేట నివాసి బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ శుక్రవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

నారాయణపేట పట్టణంలో తనతో పాటు చదువుకున్న తన మిత్రుడు బి వెంకట నరసింహ రెడ్డి దంపతుల పుత్రుడు బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి నారాయణపేట లో పుట్టి పెరిగి తన ప్రాథమిక విద్య,ఉన్నత విద్య ఇంటర్మీడియట్ విద్యను నారాయణపేటలో పూర్తిచేసుకుని ఢిల్లీలో ఫోరెన్సిక్ సైన్స్ లో గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న తర్వాత న్యాయవాద విద్యను పూర్తి చేసుకొని ఇటీవల న్యాయమూర్తిగా ఎన్నికైన కొత్త మెజిస్ట్రేట్ బి సత్యనారాయణ రెడ్డిని కోర్టు కాంప్లెక్స్లో కేంద్ర ప్రభుత్వా న్యాయవాది రఘువీర్ యాదవ్, మాజీ పి పి ఆకుల బాలప్ప అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెనూ శ్రీ లను ఇతర సహా న్యాయవాదులతో కలిసి శాలువాలతో సత్కరించి సన్మానించినారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి చిన్న వయసులో తన అన్ని చదువులను ప్రథమ శ్రేణులు న్యాయమూర్తిగా ఎన్నికైన సత్యయన్ రెడ్డి అతి తొందరలో జ్యుడీషియల్ పరిధిలో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వారిఎంపిక వారి తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణం అని, ఆయన తల్లిదండ్రులు కూడా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తండ్రి స్వయంకృషితో ప్రైవేటు వృత్తిలో మోటార్ వైండింగ్ మెకానిక్ గా జీవితాన్ని ప్రారంభించి తన కుమారుడిని ఉన్నత స్థానంలో చూసి గర్విస్తున్నాడని ఆయన మిత్రుడు రఘువీర్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు.

మాజీ పీపీ ఆకుల బాలప్ప మాట్లాడుతూ న్యాయమూర్తిగా ఎంపికైన సత్యనారాయణ రెడ్డి తన వృత్తి జీవితంలో నారాయణపేటకు మరింత పేరు తేవాలని కోరినారు.తమ మార్గదర్శనం కన్నా ఆయన కష్టమే ఆయనను ఈ స్థానానికి తీసుకువచ్చిందని అడిషనల్ మెనూ శ్రీ ఆయనను అభినందించారు. సందర్భంగా వారి తల్లిదండ్రులైన బి వి ఎన్ రెడ్డి దంపతుల ను ఆయన మిత్రుడు రఘువీర్ యాదవ్ శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా తనను ఈ మార్గంలో నడిపించి సహకరించిన పెద్దలందరికీ పేరుపేరునా సత్యనారాయణ రెడ్డి ,నరసింహారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీపీ బడుగు ప్రభాకర్, న్యాయవాదులు టి రామచంద్రయ్య ,సంజన ,లక్ష్మీనారాయణ, కోర్ట్ కానిస్టేబుల్ విజయకుమార్ పాల్గొన్నారు.

మిస్సింగ్ సర్వే నెంబర్ లో రూ.4 కోట్ల భూమి గోల్ మాల్

- ఇతరుల చేతుల్లోకి..? - పాత రికార్డులకు భిన్నంగా భూబదలాతో మార్పులు

అచ్చంపేట,అక్టోబర్ 23:(వుదయం ప్రతినిధి)

ఉప్పునుంతల మండలంలో ఉదంతం

కోట్ల విలువైన భూమి.. వరుసగా మారిన యాజమాన్య హక్కులు.. అసలు భూమితో సంబంధం లేని వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్లు. ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లిలో 193వ సర్వే నెంబర్ లో 17 గంటల భూమి వ్యవహారంలో అనేక అనుమానాలు తావిస్తున్నాయి.

ఒకప్పుడు గ్యాంగ్ స్టర్ నయీమ్ అనుచరుల పేరిట ఉన్న భూమి.. ఇప్పుడు వరుస రిజిస్ట్రేషన్లతో ఇతరుల చేతుల్లోకి మారింది. ఎవరి విషయంలో ఆల్టరేషన్ రికార్డుల్లో కనిపించే ఈ భూమిని నయీమ్ ఎన్ కౌంటర్ తర్వాత రికార్డుల్లో ప్రత్యక్షమైన ఇతరుల పేర్లపై భూమి బదిలీ అయినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారు. దాదాపు రూ.4 కోట్ల విలువైన భూమి బదిలీ వెనుక పాత్రలు స్పష్టం కావాలి అనే ప్రశ్న తలెత్తుతోంది. రెవెన్యూ రికార్డులను ఎవరు మార్చారు..? అధికారుల పాత్రపై అనేక ప్రశ్నలు కలకలం రేపుతున్నాయి.

నా దృష్టికి వచ్చింది విచారణ జరుపుతున్నాను – నాగర్ కర్నూల్ కలెక్టర్

అసలు విషయం ఏమిటి?లి

- నయీమ్ అనుచరుల పేరిట ఉన్న భూమి.. ఇప్పుడు ఇతరుల చేతుల్లోకి..?
- పాత రికార్డులకు భిన్నంగా భూబదలాతో మార్పులు
- వరుస రిజిస్ట్రేషన్లపై అనుమానాలు
- బాధిత కుటుంబం ఫిర్యాదు
- తాసిల్దార్, ఆర్డీవో పాత్రపై విచారణకు డిమాండ్

కోట్ల విలువైన భూమి ఇదే

నయీమ్ అనుచరుల పేరిట 2006లో భూమి:

నల్లమల ప్రాంతంలో ఒకప్పుడు నయీమ్ అనుచరుల బెదిరింపులతో రైతులు భూములు కోల్పోయారు. అయ్యవారిపల్లి చెందిన కొందరు రైతుల నుండి నయీమ్ అనుచరులు బెదిరించి దాదాపు 47 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే గ్రామానికి చెందిన రాంరెడ్డి 2006లో సర్వే నెంబర్ 115 లోని 13.17 ఎకరాల భూమిని నయీమ్ అనుచరుల వైపు చాంద్ పాషా, ఖాజా మియా పేరిట రిజిస్ట్రేషన్ జరిగింది. అప్పట్లో బెదిరింపుతో తక్కువ ధరలో భూమి బదిలీ జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. నయీమ్ మరణం తర్వాత కొందరు రైతులు తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సాగు చేసుకుంటున్నారు. రాంరెడ్డి నుండి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని 2008లో నాగయ్య అనే వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ జరిగింది. అనంతరం ఆయన ప్రభుత్వం, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా భూమిలో లేఅవుట్ ప్లాట్లుగా విభజించి విక్రయం చేస్తూ గ్రామస్తులు తెలిపారు. అయితే 2018 వరకు రెవెన్యూ రికార్డుల్లో రాంరెడ్డి పేరుతో భూమి ఉన్నట్లు ఆధార్యత సర్వే నెంబర్ మిస్సింగ్ లోకి వెళ్లింది. తాజాగా భూమి రికార్డుల్లో ఇతరుల పేరిట భూమి బదిలీ జరిగినట్లు రికార్డు చూపిస్తుండగా, అయితే మిస్సింగ్ అయిన భూమిని తమ పేరుపై బదిలీ చేయాలని రాంరెడ్డి కుమారుడు సహా షేక్ రెహమాన్ అది రికార్డుల అధికారి ఆసక్తి విషయం చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదు చేశారు.లెక్కలు పేర్కొన్నారు.

ఆగస్టు 19 తేదీన 11 మందికి బదిలీ.. సెప్టెంబర్ 26న ఇద్దరికీ మార్పు..?

2026 ఆగస్టు 19వ తేదీన ఉప్పునుంతల తహసిల్దార్ కార్యాలయంలో ఈ భూమికి సంబంధించి 11 మంది పేరుతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు రికార్డుల్లో కనిపిస్తుంది.లి తమ కుటుంబ భూమిని బూటకపు మల్లయ్య, అశోక్ తదితర పంచాయతీ కుటుంబ సభ్యుల పేరిట బదిలీ చేసుకున్నారని షేక్ రెహమాన్ తెలిపారు. బుర్రపేట మల్లయ్య, అశోక్, స్వామి, బూర మల్లయ్య, పుట్టి శేఖర్, బూర సతీష్, తాటి పుల్లయ్య, వడ్ల శ్రీనివాస్, అశోక్ భూగారం, తాటూర్ రమేష్ పేరిట భూమి బదిలీ చేశారు. అనంతరం 11 మందిపై ఉన్న భూమిని 2026 సెప్టెంబర్ 26న ఇద్దరికీ అమ్మకం జరిగినట్లు రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ విధంగా భూమి బదిలీ తర్వాత అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉప్పునుంతల తాసిల్దార్, ఆర్డీఓ, ధరణి ఆపరేటర్లపై అనుమానాలు?

ఈ భూమి బదిలీ వ్యవహారంలో ఉప్పునుంతల తాసిల్దార్ అడిషనల్ నుండి అచ్చంపేట ఆర్డీవో పనిచేసిన ఇటీవల బదిలీపై వెళ్లిన అభిషేక్ యాదగిరి, ఉప్పునుంతల, ఆర్డీవో కార్యాలయం దగ్గర అప్ ధేర్ పాత్రపై స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్డీవో బదిలీ అయిన క్రమంలో తాసిల్దార్, ధరణి ఆపరేటర్లకు బీభత్సం చేసిన భూమిలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు గుట్టు చప్పుడు కాకుండా, అక్రమంగా రిజిస్ట్రేషన్ ఆర్డర్ పొంది పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఉప్పునుంతల తాసిల్దార్, అప్పటి ఆర్డీవో ఇద్దరికీ కలిసి చాలా భూములు అక్రమంగా భూ బదిలీలు చేయడం ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు రూ.4 కోట్ల విలువైన భూమి యాజమాన్య హక్కులు మారుతూ ఉత్త తాళపత్రం సమర్పించినట్లు విచారణ మేరకు తెలిసింది. తాళపత్రం అచ్చంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ పోయారు. మిస్సింగ్ సర్వే నెంబర్ ఎలా ప్రత్యక్షమైంది, భూమి హక్కులు ఎలా ఆధారంగా మారాయి, వరుస రిజిస్ట్రేషన్ల వివరాల పాత ఉంది, బాధిత కుటుంబం ఫిర్యాదుపై అధికారులు విచారణ జరిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శివపాల్ రెడ్డి భూమి బదిలీ లాంఛనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, విచారణ నివేదిక, ఆధారాలు తేవాలని సమాచార ఇవ్వాలని సమాచారం భూమి కబ్జా కింద తాసిల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు షేక్ రెహమాన్ తెలిపారు. అయితే ఈ విషయంపై వివరణ కోరుతూ ఉప్పునుంతల తాసిల్దార్ సునితకు ఫోన్ చేస్తే స్పందించలేదు.

నయీమ్ బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు:

2008లో అప్పట్లో మా నాన్నకు బెదిరించి 115 సర్వే నెంబర్ లోని 13.17 ఎకరాల భూమిని నయీమ్ అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మా గ్రామంలో చాలా మంది రైతుల నుండి దాదాపు 47 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. నయీమ్ చనిపోయిన తర్వాత మిగిలిన వారందరూ వారి వద్ద ఉన్న భూమిని తిరిగి తీసుకొని సాగు చేసుకుంటున్నారు. మా భూమి 2018 వరకు రెవెన్యూ రికార్డుల్లో మా నాన్న రాంరెడ్డి పేరుతో ఉంది. ఆ భూమిని ఆల్టరేషన్ చేయాలనే నెపంతో అధికారులకు అనేకసార్లు ఫిర్యాదులు చేశాను. సర్వే నెంబర్ మిస్సింగ్ లో ఉందని అంటూ అధికారులు దాటవేస్తున్నారు. ఉప్పునుంతల 2026 ఆగస్టు 19న మా భూమిని సంబంధం లేని వ్యక్తులు 11 మంది పేర్లతో భూమి బదిలీ అయింది. వెంటనే తిరిగి గత నెల 26వ తేదీన ఆ భూమిని 11 మంది నుండి ఇద్దరికీ బదిలీ చేశారు. అసలు విషయం జరిగిందే మాకు తెలవదు. గ్రామ సర్పంచ్, అందరం కలిసి కలెక్టర్, అప్పుడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. అక్రమంగా భూమి బదిలీ అయిందని ఫిర్యాదు విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశాం. సంబంధిత ప్రొసీడింగ్స్ కూడా ఇవ్వలేదు కోరుతూ, ఉప్పునుంతల తాసిల్దార్, ఆర్డీవో పనిచేసిన యాదగిరి, ధరణి ఆపరేటర్లపై అనుమానాలు ఉన్నాయి. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ తమకు న్యాయం చేయాలి.

రాంరెడ్డి కుమారుడు ధ్యాన శివపాల్ రెడ్డి

విచారణ కలెక్టర్ కు నివేదిస్తాను.. ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లి సర్వే నెంబర్ 115లోని 13.17 ఎకరాల భూమి వ్యవహారం నా దృష్టికి వచ్చింది. గ్రామస్తులు నన్ను కలిసి విషయం చెప్పారు. నేను ఆ భూమిని స్వయంగా చూసి పూర్తి రికార్డులు పరిశీలించాను. పూర్తి నివేదికను కలెక్టర్ కు అందజేస్తాను. ఎలా రిజిస్ట్రేషన్ చేశారు, ఎవరు చేశారు.. దానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆస్తి అంతా పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుంది.

అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా

కుళాయి నీటి సమస్యపై ఫోన్ చేస్తే సర్పంచ్ భర్త బూతు పురాణం

- **3వ వార్డు దళిత వార్డు మెంబర్ ఆంజనేయులుపై సర్పంచ్ భర్త రాఘవేందర్ దుర్భాషలు పలికాడని ఆరోపణలు**
- **కాశీంపూర్ గ్రామంలో ఘటనపై చర్చ**
- **ప్రజాప్రతినిధులతో దురుసు ప్రవర్తనపై విమర్శలు**

బషీరాబాద్ (వుదయం అక్టోబర్ 23): గ్రామంలో తాగునీటి సమస్యపై ఫోన్ చేసి మాట్లాడిన 3వ వార్డు దళిత వార్డు మెంబర్ ఆంజనేయులును సర్పంచ్ హరిత భర్త రాఘవేందర్ అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కుళాయి నీటి విషయమై ఫోన్ చేయగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రజా సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధిపై ఈ విధంగా దురుసుగా వ్యవహరించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో ప్రజలకు

తాగునీటి సరఫరా సక్రమంగా అందేలా చూడటం గ్రామ పంచాయతీ బాధ్యతల్లో ఒకటి. ప్రజలకు నీటి సమస్యలు తలెత్తినప్పుడు వాటిని సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం వార్డు సభ్యుల బాధ్యత. ఈ క్రమంలో కుళాయి నీటి విషయమై ఆంజనేయులు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలుస్తోంది. అయితే, సమస్యపై చర్చించాల్సిన సమయంలో తనను అసభ్య పదజాలంతో దూషించారని ఆయన ఆరోపిస్తున్నట్లు సమాచారం. ప్రజలచే ఎన్నుకోబడిన వార్డు సభ్యులు తమ వార్డులోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేయడం వారి బాధ్యత. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు వంటి సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యుల పాత్ర కీలకంగా ఉంటుంది. అలాంటి సమస్యలను ప్రస్తావించినప్పుడు చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాల్సి ఉండగా, దుర్భాషలు పలికారనే ఆరోపణలు రావడం చర్చకు దారితీసింది. గ్రామ అభివృద్ధి కోసం ఎన్నికైన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విభేదాలకు అతీతంగా ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. సమస్యలపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవంతో చర్చించుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. ప్రజా సమస్యలను లేవనెత్తే వార్డు సభ్యులతో గౌరవప్రదంగా వ్యవహరించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి సహకరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా, 3వ వార్డుకు చెందిన దళిత వార్డు మెంబర్ ఆంజనేయులుపై సర్పంచ్ భర్త రాఘవేందర్ దుర్భాషలాడినట్లు వచ్చిన ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే, ఈ ఘటనలో కులం పేరుతో దూషణలు జరిగాయా లేదా అన్నది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. దీనిపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, ఇరువైపుల వాదనలు తెలుసుకుని వాస్తవాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడటంతో పాటు, ప్రజాప్రతినిధుల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పరస్పర గౌరవంతో వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

గొర్రెల కాపరిలా బాల్యం.. 16 మంది చిన్నారులు!

గట్టు మండలంలో బడిమానేసిన పిల్లల గుర్తింపు

అధికారుల అవగాహనతో ముగ్గురికి బడిలో పునఃప్రవేశం

గట్టు అక్టోబర్ 23 (వుదయం బ్యూరో)చదువుకోవాల్సిన వయసులో గొర్రెల కాపరులుగా.. తరగతి గదుల్లో ఉండాల్సిన చిన్నారులు వనుల్లో నిమగ్నమవుతు న్నారు. గట్టు మండలంలో బడిమానేసి గొర్రెల కాపరులుగా పనిచేస్తున్న 16 మంది పిల్లలను అధికారులు గుర్తించారు. కార్మిక శాఖ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీసు శాఖ, ఎంవీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాండెడ్ లేబర్ (వెట్టి చాకిరీ) చట్టాలపై వివరించి, పిల్లలను వనులకు పంపకుండా పూర్తిస్థాయిలో చదివించాలని సూచించారు. తమ పిల్లలను బడికి పంపిస్తామని తల్లిదండ్రులు అంగీకరించినట్లు నిర్వాహకులు

తెలిపారు.ఐదు రోజుల గైర్హాజరు.. ముగ్గురికి బడిబాట! వరుసగా ఐదు రోజులపాటు పాఠశాలకు గైర్హాజరైన పిల్లలకు కూడా ప్రేరణ కల్పించి, చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముగ్గురు పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించారు.

గుర్తించిన పిల్లలందరూ తిరిగి బడికి చేరేలా, చదువు మధ్యలో ఆగిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. బాల్యం పనిభారంలో కాదు.. బడిలో వికసించాలి!

నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఐదు లక్షల వేల రూపాయల విలువైన ఎల్ఓసిల పంపిణీ

పటాన్చెరు (వుదయం):ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పిఎన్ఆర్ కాలనీకి కరుణా శ్రీ, పటాన్చెరు డివిజన్ అంబేద్కర్ కాలనీకి చెందిన బయగళ్ల ప్రతాప్ లు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి ఒక్కొక్కరికి రెండు లక్షల 50 వేల రూపాయల చొప్పున 5 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, శ్రీ రాములు, బలవంత్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి

- అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్

లక్షణాలున్నవారిని గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించాలి

- కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులతో జాతీయ స్థాయి సమన్వయ సమావేశం

సూర్యాపేట అక్టోబర్ 23
వుదయం ప్రతినిధి

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎన్సీసీ అధికారులతో దేశవ్యాప్తంగా టీబీ నిర్మూలనపై చేపట్టే కార్యక్రమాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టి, టీబీ రహిత గ్రామాల సంఖ్యను పెంచాలన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు.

గ్రామాల్లో దీర్ఘకాలిక దగ్గు, తదితర టీబీ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వెంటనే సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో జోష్ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజల్లో టీబీ లక్షణాలున్న వారిని గుర్తించే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని తెలిపారు.

ఈ బృందాల్లో ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, యువ క్రీడాకారులు, మై భారత్ వాలంటీర్లను భాగస్వాములను చేసి ప్రజల్లో వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలోనూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం కూడా వ్యాధి నియంత్రణలో కీలకమని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వివిధ సంస్థల సహకారంతో టీబీ బాధితులకు పోషకాహార కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, సంబంధిత డాక్టర్లు, మెడికల్ సిబ్బంది, ఎన్సీసీ అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న విద్యార్థి మహీధర్, స్వర్ణం సాధించిన సాత్వికకు కలెక్టర్ అభినందన

ఇన్స్పైర్ సైన్స్ పోటీల్లో ప్రతిభ, సీబీఎస్ఈ జాతీయ అథ్లెటిక్స్‌లో స్వర్ణ పతక విజేతలకు ప్రశంసలు

సూర్యాపేట అక్టోబర్ 23 వుదయం ప్రతినిధి

జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టుల ఇన్స్పైర్ పోటీల్లో ప్రదర్శించిన లి"స్మార్ట్ స్టీరింగ్ విత్ హెల్త్ ఎలర్ట్స్ టు రెడ్యూస్ ది యాక్సిడెంట్స్"లి ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన ఎం ఎస్ ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి కొల్లు మహీధర్‌ను మరియు సి బి ఎస్ ఈ జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ 600 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం సాధించిన ఎం.ఎస్.ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థిని కుమారి సాత్వికను జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నంద లాల్ పవార్ అభినందించారు.జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, వారి భవిష్యత్ ఉన్నతికి ఆకాంక్షలు తెలిపారు. విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి కారణమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్. శ్రీనివాస్ రావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీ దేవరాజు మరియు సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ పారిశ్రామిక ప్రమాదాలు?

- **కార్మికుల ప్రాణాలకు భద్రతేది?**
- **పరిశ్రమల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యమెందుకు?**
- **సిగాచి ఘటన మరువకముందే సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ.. ఇద్దరు కార్మికుల మృతి..**
- **సిగాచి ఘటన నుండి గుణపాఠం నేర్చుకోవడంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం..**
- **మృతుల కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారం..**
- **అంత్యక్రియల కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం..**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం..**

పటాన్చెరు/గడ్డపోతారం

సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం తాలూకు విషాదం మరువకముందే.. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు.. పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సరాక పరిశ్రమ గ్యాస్ లీకేజీ ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు యాజమాన్యంతో చర్చించి 70 లక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు అంత్యక్రియల కోసం లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత యాజమాన్యాన్ని ఆదేశించారు.సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి వెళ్లిన ఎమ్మెల్యే జిఎంఆర్.. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యంతో పాటు వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన పైన పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక శాసనసభ్యుడిగా కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..పారిశ్రామిక అభివృద్ధికి పటాన్చెరు ప్రాంతం కీలక కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి, లాభాల పెరుగుదల మాత్రమే కాదని.. అక్కడ పనిచేసే ప్రతి కార్మికుడి ప్రాణానికి భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు పనిచేస్తున్నాయా? గ్యాస్ లీకేజీలను నివారించే రక్షణ చర్యలు తీసుకుంటున్నారా? అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలి

సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీకి దారితీసిన కారణాలను వెలికితీయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రతా లోపాలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని గుర్తించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

సిగాచి ఘటన నుంచి తగిన గుణపాఠాలు నేర్చుకుని కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, వరుస పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని విమర్శించారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జీఎంఆర్ హామీ ఇచ్చారు. కార్మికుల భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

మానవత్వం మరిచిన లారీ డ్రైవర్..

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు రాస్తారోకో

కంపెనీ యాజమాన్యమే బాధ్యత వహించాలి.. మృతుడి బంధువుల డిమాండ్

కోదాడ అక్టోబర్ 23(వుదయం) గురువారం రాత్రి కోదాడ--మేళ్లచెరువు ప్రధాన రహదారిపై గణపురం స్టేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మేళ్లచెరువు మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన కలకొండ శ్రీను మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న శ్రీనును లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు మృతుడి బంధువులు ఆరోపించారు.

ప్రమాదం జరిగిన తర్వాత లారీని ఆపకుండా వెళ్లిపోవడంపై మృతుడి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యం సూచనల మేరకే డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోయాడని వారు ఆరోపిస్తూ, మృతుడి కుటుంబానికి కంపెనీ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మృతుడు శ్రీనుకు ఇద్దరు కుమారులు ఉన్నారని, ఆయన భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారని బంధువులు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయిన పరిస్థితిలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బంధువులు స్పష్టం చేశారు.

కోదాడ రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనను సర్దుమణిగించారు.

ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

అమర హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ కుటుంబాన్ని పరామర్శించిన అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 23:వుదయం ప్రతినిధిపోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాలు-2026, పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి ఈరోజు సూర్యాపేట పట్టణంలో నివసిస్తున్న పోలీసు అమరవీరుడు హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ కుటుంబ సభ్యులను వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో బడే సాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు.ప్రజల రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. 2000 సం.లో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేసిన సమయంలో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ వారితో వీరోచితంగా పోరాడి అమరులయ్యారని గుర్తుచేశారు. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించి, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన పోలీసు శాఖకు గర్వకారణమని అన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, వారి త్యాగఫలితంగానే ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించగలు గుతున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల పోలీసు శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు, వారి సేవలను ప్రజలకు తెలియజేయడం, వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకోవడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దేశం కోసం, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను ప్రతి పౌరుడు గౌరవించాలని, వారి త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, అమర పోలీసు బడే సాహెబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

ప్రమాద ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలి

రహదారి భద్రతపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి

జీరో ఫటాలిటీ డిస్ట్రిక్ట్ - ఖీణ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ సంయుక్త పరిశీలనలి

సంగారెడ్డి, అక్టోబర్ 23: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలను తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రమాద రహిత (జీరో ఫటాలిటీ డిస్ట్రిక్ట్ - ఖీణ) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జాతీయ రహదారి 65పై పటాన్‌చెరు నుంచి దిగ్వాల్ కూడలి వరకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ , అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, జాతీయ రహదారులు, రహదారులు--భవనాలు, పోలీసు, రవాణా శాఖల అధికారులతో కలిసి పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ మార్గంలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రమాద స్థలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరిచి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఎత్తైన విద్యుద్దీపాలు, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పటాన్‌చెరువు బస్టాప్ ప్రాంతంలో పాదచారుల వంతెన ఏర్పాటు చేయాలని, కంది చౌరస్తా వద్ద రహదారి అంచులను సూచించే గుర్తులు ఏర్పాటు చేసి, రహదారి స్పష్టంగా కనిపించేలా విద్యుద్దీపాల సదుపాయం కల్పించాలని సూచించారు. పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద రాకపోకల రద్దీని తగ్గించడంతో పాటు, బన్సుల నుంచి దిగే ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించే రంబుల్ స్ట్రిక్స్ ,స్పీడ్ బ్రేక్స్ ,వాహనాల వేగాన్ని గుర్తించే పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదకర మలుపులు, ఇరుకైన రహదారుల వద్ద ముందస్తు హెచ్చరికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి పై వాహనాల అధిక వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద రహిత జిల్లా లక్ష్యంగా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, సూచించారు. రాకపోకల నియంత్రణ, వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తించిన లోపాలను త్వరితగతిన పరిష్కరించి, చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ధృతాయుత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితా దేవి, రహదారులు--భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు రవీందర్, డి టి ఓ వాసు, ఏ ఎమ్ వి ఐ గౌతమ్, సంగారెడ్డి, పటాన్‌చెరు ఉప పోలీసు అధికారుల బృందాల అధికారులు, జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొల్ల జానయ్యకు మార్కెట్ కమిటీ చైర్మన్ పరామర్శ

బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన



సూర్యాపేట అక్టోబర్ 23 వుదయం ప్రతినిధిసూర్యాపేట మండలం బాలెంల స్టేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొల్ల జానయ్యను స్థానిక ఏరియా హాస్పిటల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా బాధితుడికి అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జానయ్య ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు.ప్రజలకు కష్టం వచ్చినప్పుడు అండగా నిలవడం, ఆపద సమయంలో బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడం ప్రజాసేవలో భాగమని కొప్పుల వేణారెడ్డి చాటిచెప్పారు.వారి వెంట మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు పులగం వెంకట్ రెడ్డి, ఆరెగూడెం ఉపసర్పంచ్ గొల్ల వెంకన్న, మాజీ జెడ్పిటిసి అవిలయ్య, బాలెంల మాజీ సర్పంచ్ రామసాని రమేష్, దాస్ తండా మాజీ సర్పంచ్ మోతిలాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మిద్దె రమేష్, మోదాల ముత్తయ్య, భాస్కర్, పులగం సైదిరెడ్డి, పందిరి మల్లేష్, కోడి కిరణ్, నర్సింగ్ కిరణ్, పిల్లల నాగరాజు, షేక్ గౌస్ పాషా, అనంతుల నవీన్, రావుల రమేష్, బూర సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక చర్యలు

కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుతో ఫీడర్ లోడ్ తగ్గింపు

సత్తుపల్లి అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఖమ్మం సర్కిల్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఖమ్మం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. కొన్ని రోజులుగా కొన్ని వార్త పుత్రికలలో వచ్చిన "సాగు నీరు అందక ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా" వార్తల నేపథ్యంలో జిల్లా ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈ/ఆపరేషన్/ సత్తుపల్లి ఎల్. రాములు తో కలిసి 33/11 కేవీ లింగపాలెం, కందుకూరు సబ్‌స్టేషన్లను తనిఖీ చేసి, విద్యుత్ సరఫరా పరిస్థితులు, లోడ్ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు సాగు నీరు అందకపోవడంలో విద్యుత్ సరఫరాకు సంబంధం లేదనీ తెలియచేశారు. అలాగే డివిజన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. 132/33 కేవీ గంగారం సబ్‌స్టేషన్ నుంచి సరఫరా పొందుతున్న 33 కేవీ పాకల గూడెం ఫీడర్‌పై గరిష్ఠ కరెంట్ 380 ఆంపియర్లకు చేరింది. తక్షణ చర్యల్లో భాగంగా కిష్టాపురం, కందుకూరు సబ్‌స్టేషన్లలోని 2 ఎంవీఏఆర్ సామర్థ్యం గల కెపాసిటర్ బ్యాంకుల్లో పనిచేయని సెల్స్‌ను మార్చి, వాటిని పూర్తి సామర్థ్యంతో తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చారు. అదనంగా, ఏడు ఫీడర్లలో ఒక్కొక్కటి 600 కేవీఏఆర్ సామర్థ్యం గల ఏడు నూతన లైన్ కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. ఈ చర్యల ఫలితంగా పాక లగూడెం ఫీడర్‌పై కరెంట్ 380 ఆంపియర్ల నుంచి 340 ఆంపియర్లకు తగ్గి, 40 ఆంపియర్ల మేర తగ్గుదల నమోదైంది. ప్రస్తుతం ఈ ఫీడర్‌పై ఓవర్‌లోడ్ ట్రిప్పింగులు, తక్కువ వోల్టేజ్ సమస్యలు నివేదించబడలేదు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు, ఫీడర్ల లోడ్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఓవర్‌లోడ్ సమస్యలను నివారించి, వోల్టేజ్ స్థాయిలను మెరుగుపరచి, వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. కార్యక్రమంలో ఏఈ అంకారావు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం అందించిన గోలి దంపతులు

బీబీనగర్ మాజీ ఎంపీపీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి

విద్యార్థులు పేదరికంతో చదువుకు దూరం కాకూడదని, పై చదువులు చదివే వారికి తమవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మాజీ ఎంపీపీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామానికి చెందిన సోము జంగయ్య – మాధవి ల కుమార్తె సోము నిఖిత వైద్య విద్య కొరకు యాభై వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. బీబీనగర్ మండల కేంద్రంలోని సాయి సంతోషి హైస్కూల్ లో 10 వ తరగతి ఫలితాల్లో 10 జీపీఏ తో పాసై, ఉత్తమ ప్రతిభ కనపరిచి, ఇంటర్మీడియేట్ లో 989/1000 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించి, నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు తో పటాన్ చెరువు లోని మహేశ్వర మెడికల్ కళాశాలలో ఎం బీ బీ ఎస్ సీటు పొందిన నిరుపేద కుటుంబానికి చెందిన సోము నిఖిత ను శాలువాతో ఘనంగా సన్మానించారు. వైద్య కళాశాల ఫీజు చెల్లించలేని నిఖిత, డాక్టర్ చదువుకు దూరం కాకూడదని భావించి, ఈ ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గోలి పింగల్ రెడ్డి, సాయి సంతోష్ హైస్కూల్ కరస్పాండెంట్ ఈసారపు అచ్చయ్య గౌడ్, మండల మాజీ కో– అప్షన్ సభ్యులు ఎండీ.అక్బర్, పింగల్ అన్న సేవాదల్ అధ్యక్షులు ఎండీ.మోయిన్ నాయకులు ఎలుగుల నరేందర్, కాసుల అజయ్ కుమార్ తదితరులు పాల్గొని సోము నిఖిత ను అభినందించారు.

జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి!

వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భద్రాచలంలో నిరసన

భద్రాచలం 23/10/26 వుదయం ప్రతినిధి:

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక, భద్రాచలం పట్టణ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న అమర వీరుల స్తూపాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను, ఎన్నికల సంఘం పనితీరును విమర్శించారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఏఐకేఎస్ జిల్లా నాయకులు ఎం.బి. నర్సారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు మారెడ్డి శివాజీ, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శివ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఎన్నికల సంఘం ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకొని తన రాజకీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉందని తెలిపారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, సుమారు 14 కోట్ల ఓట్ల తొలగింపుపై ఆందోళన వ్యక్తమవుతోందని నాయకులు పేర్కొన్నారు.

అంబేద్కర్ సెంటర్‌లోని అమర వీరుల స్తూపాల వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ, ఎన్నికల సంఘం నిష్పక్షపాత పనితీరు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం స్వామి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి. సీతాలక్ష్మి , పట్టణ అధ్యక్షురాలు జీవనజ్యోతి, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు నకరికంటి నాగరాజు, అజయ్ కుమార్, చంద్రలీల, వెంకటలక్ష్మి , ఐద్వా నాయకులు నాదెళ్ల లీలావతి, గౌతమి, ఉస్తేలా జ్యోతి, నాగలక్ష్మి , కనకశ్రీ, ప్రజా సంఘాల నాయకులు సాయన్న, రాఘవయ్య, రాయల రాములు తదితరులు పాల్గొన్నారు. పరిరక్షణే లక్ష్యంగా వామపక్ష, ప్రజా సంఘాల ఐక్య పోరాటాలను కొనసాగిస్తామని, ఓటు హక్కు రక్షణ కోసం ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

విద్యాబుద్ధులు నేర్పే సర్కార్ బడిలో ధ్వంసకాండకు బాధ్యులెవరు?

- **వాయిలసింగారంలో గుర్తు తెలియని వ్యక్తుల నిర్వాకం**
- **పోలీసులకు ప్రధానోపాధ్యాయురాలి ఫిర్యాదు**

అనంతగిరి, అక్టోబర్ 23 వుదయం

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడిన ఘటన అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామంలో వెలుగుచూసింది దసరా సెలవులను ఆసరాగా చేసుకొని పాఠశాలలోని వివిధ వస్తువులను ధ్వంసం చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆర్. జ్యోతి తెలిపారు.పాఠశాల ఆస్తులను ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని, విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులైన ప్రభుత్వ పాఠశాలల పట్ల ఇలాంటి నిర్లక్ష్య ధోరణి ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.ప్రజాధనంతో సమకూర్చిన పాఠశాల సామగ్రిని ధ్వంసం చేయడం వల్ల విద్యా వాతావరణానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై ప్రధానోపాధ్యాయురాలు ఆర్. జ్యోతి అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు ఘటనపై విచారణ జరిపి, పాఠశాలలోని వస్తువులను ధ్వంసం చేసిన వారిని గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు...

పాఠశాలలకు రక్షణ ఏదీ

విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, పాఠశాల ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇలాంటి ఘటనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు.

నల్గొండను కరువు జిల్లాగా ప్రకటించాలి

- **రైతులకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలి**
- **కలెక్టర్‌కు కిసాన్ మోర్చా నాయకులు వినతి**

నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 23

నల్గొండ జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నల్గొండను కరువు జిల్లాగా ప్రకటించాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. జిల్లాలో రెవెన్యూ మండలాల వారీగా గ్రామాల్లో సర్వే నిర్వహించి కరువు పరిస్థితులను అంచనా వేయాలని నాయకులు కోరారు. కరువు సహాయక చర్యల కోసం ప్రతి మండలానికి రూ.10 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వానాకాలం పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతు భరోసా నిధులను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అలాగే జిల్లాలో వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం కింద పనిదినాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ మండలాల వారీగా గ్రామాల్లో సర్వే నిర్వహించి కరువు సహాయక చర్యలు చేపట్టాలి.

కరువు అంచనా వేసి నిధులు విడుదల చేయాలి

ప్రతి మండలానికి రూ.10 కోట్ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి కరువు సహాయక చర్యలు చేపట్టాలి.. జిల్లాలో వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం పనిదినాలు పెంచాలి వానాకాలం పంటలు ఎండిపోవడంతో నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.30 వేల చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలి రైతులకు తగినంతగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలి. రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలి ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ వీరెల్లి. బిజెపి కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి బిజెపి టూ టౌన్ ప్రెసిడెంట్ మిర్యాల వెంకటేశ్వర్లు బిజెపి కిషన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి యానాల కరుణాకర్ రెడ్డి జగ్జీవన్ రావు గారు కుంభం .వెంకటరెడ్డి. ఆది శ్రీను పసుపులేటి అంజయ్య. అంజయ్య చారి వినీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- **భద్రాచలం పట్టణంలోని 20 వార్డుల్లో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**
- **డ్రైనేజీల శుభ్రత, చెత్త తొలగింపు, దోమల మందు పిచికారీకి తక్షణ చర్యలు తీసుకోవాలి**
- **ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు అందే దుర్గ విజ్ఞప్తి**

భద్రాచలం, 23/10/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం పట్టణంలోని 20 వార్డుల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు అందే దుర్గ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలు వార్డులు, కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం, చెత్తాచెదారం, వివిధ రకాల వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఆమె పేర్కొన్నారు.

భద్రాచలం పట్టణం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని, ఇక్కడికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు వస్తుంటారని అందే దుర్గ గుర్తుచేశారు. అటువంటి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండటం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా వర్షాలు, తేమతో కూడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ముందస్తు నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో ఉన్న ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు, నివాస ప్రాంతాలు, వీధులు, డ్రైనేజీలు, ఖాళీ స్థలాలను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని కోరారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పూడుకుపోవడం, మురుగునీరు సక్రమంగా ప్రవహించకపోవడం, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అన్నారు. మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండకుండా డ్రైనేజీలను శుభ్రపరచి, నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్, ఈవో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతి వార్డులో పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించాలని అందే దుర్గ కోరారు. పారిశుద్ధ్య సిబ్బందిని అవసరమైన ప్రాంతాలకు పంపించి, డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించాలని సూచించారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిలిచిపోకుండా, నివాస ప్రాంతాల సమీపంలో దుర్వాసన వ్యాపించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, బీబీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీబీనగర్ ఎస్‌హెచ్ఓ సూర్య నాయక్, ఎస్ఐ రమేష్ మరియు పోలీస్ సిబ్బంది సమన్వయంతో నిర్వహించారు. విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేయడం, సమాజంలో పోలీసుల పాత్రతో పాటు పౌరుల బాధ్యతలను వివరించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యం. ఈ వ్యాసరచన పోటీలను రెండు అంశాలపై నిర్వహించారు. సైబర్ నేరాల నివారణలో పౌరులు మరియు పోలీసుల పాత్ర. మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర – విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలి? ఈ పోటీల్లో సుమారు 87 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, నిర్దేశించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా తమ వ్యాసాలను సమర్పించారు. విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడం ఎంతో ముఖ్యమని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ, సైబర్ నేరాల నివారణ మరియు మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి నిత్య అన్నదానానికి భారీ విరాళం

రూ.1,50,116 విరాళంగా అందజేసిన బెంగళూరు వాస్తవ్యులు శ్రీ పి. కిషోర్

భద్రాచలం 23/10/26 వుదయం ప్రతినిధి



జై శ్రీరామ్.. దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి గాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతా రామచంద్రస్వామివారి దేవస్థానంలో భక్తులకు అందిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు, దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ స్వామివారి సేవలో భాగస్వాములవుతున్నారు. భక్తులకు అన్నప్రసాదం అందించాలనే పవిత్ర సంకల్పంతో దాతలు ముందుకు వస్తూ తమకు తోచిన విధంగా విరాళాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలో బెంగళూరు వాస్తవ్యులు శ్రీ పి. కిషోర్ గారు శ్రీ సీతారామచంద్రస్వామివారి నిత్య అన్నదాన కార్యక్రమం నిమిత్తం రూ.1,50,116/– (అక్షరాలా రూపాయలు ఒక లక్ష యాభై వేల నూట పదహారు మాత్రమే) విరాళంగా అందజేశారు. భద్రాద్రి రామయ్యపై తమకున్న అపారమైన భక్తి, విశ్వాసాలకు నిదర్శనంగా అన్నదాన సేవకు విరాళం అందించడం విశేషంగా నిలుస్తోంది. భద్రాద్రి రామయ్య సన్నిధిలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి తమ వంతు ఆర్థిక సహకారం అందించడం ద్వారా భక్తులకు అన్నప్రసాదం అందించే సేవలో ఆయన భాగస్వాములయ్యారు. ఇటువంటి విరాళాలు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించేందుకు, మరింతమంది భక్తులకు సేవలు అందించేందుకు తోడ్పడతాయి.

ముదిరాజులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

చండూరు,అక్టోబర్ 23 (వుదయం):

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను వెంటనే బీసీ–డీ నుండి బీసీ–ఏ లోకి మార్చి, రాబోయే ఎమ్మెల్సీ స్థానాల్లో నీలం మధుకు అవకాశం ఇవ్వాలని టీఎంపీఎస్ (TMPS) జిల్లా అధ్యక్షుడు కోర్వి శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చండూరులో నిర్వహించిన జిల్లా ముదిరాజ్ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, బీసీ–ఏ సాధన కోసం త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘాల నాయకులు వెంకటేశం, అరుణ, శ్రీశైలం, వెంకన్న, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ, ఏటీఎం పిన్ చెప్పొద్దు!

ఇప్పలపల్లిలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రతపై అవగాహన

ముత్తారం అక్టోబర్ 23(వుదయం ప్రతినిధి):

ఖాతాదారులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీ బ్యాంకు ముత్తారం శాఖ మేనేజర్ వి.బి. ప్రసాద్ సూచించారు. ముత్తారం మండలం ఇప్పలపల్లి గ్రామంలో కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలు,సైబర్ భద్రతపై ఖాతాదారులు, రైతులు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, సీవీవీ, ఏటీఎం పిన్ నంబర్లను ఇతరులకు తెలియజేయకూడదని సూచించారు.గుర్తుతెలియని ఏపీకే ఫైల్స్,వాట్సాప్ లింకులను ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరగాళ్ల మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్‌బీవై) పథకాల ప్రయోజనాలను వివరించారు.అర్హులైన ఖాతాదారులు ఈ బీమా పథకాల్లో చేరి ఆర్థిక భద్రత పొందాలని సూచించారు.కేడీసీసీ బ్యాంకులో పొదుపు ఖాతాలు తెరిచి బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు ద్వారా పంట రుణాలు,తనఖా రుణాలు, విద్యా రుణాలు,గృహ రుణాలు తదితర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లింపులు చేయాలని,పంట రుణాలను గడువులోగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇప్పలపల్లి గ్రామ సర్పంచ్ తాని ప్రభాకర్, ఉప సర్పంచ్ కొంతం కల్పన, కార్యదర్శి,వార్డు సభ్యులు,రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓడేడు మానేరు నదిలో ప్రమాదం.. పంచాయతీ కార్యదర్శి మృతి

భార్య, మరదలుకు అస్వస్థత..

ఘటనపై పోలీసుల దర్యాప్తు

ముత్తారం అక్టోబర్ 23(వుదయం ప్రతినిధి):

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామ సమీపంలోని మానేరు నదిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి శనిగరపు జైపాల్ (32) మృతి చెందారు.ఆయన భార్య, మరదలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దసరా పండుగ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లిన జైపాల్,తిరుగు ప్రయాణంలో కుటుంబ సభ్యులతో కలిసి మానేరు నది వద్దకు చేరుకున్నారు. నదిలో స్నానం చేస్తుండగా నీటిలో చిక్కుకోవడంతో ప్రమాదం జరిగింది. గమనించిన స్థానిక రైతు ఓగులవేన ఈశ్వరయ్య వెంటనే స్పందించి ఇద్దరు మహిళలను రక్షించారు.వారిని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చిన్నారిని ఒడ్డునే ఉంచడంతో ఆమె సురక్షితంగా బయటపడింది.జైపాల్ పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఘటనపై ముత్తారం ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి: కిషన్ రెడ్డి

మానేరు నదిలో ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణ పనుల కోసం భారీ గుంతలు తవ్విన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై బీఆర్ఎస్ ముత్తారం మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.జైపాల్ మృతదేహాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ,ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

పేదల వైద్యం కోసం భూదానం చేసిన మహనీయుడు భూతరాజు రామయ్య

నేడు 45వ వర్ధంతి

చండూరు,అక్టోబర్ 23(వుదయం):

చండూరు పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు కోసం రెండెకరాల విలువైన తన సొంత భూమిని ప్రభుత్వానికి దానంగా ఇచ్చిన దాత, దివంగత భూతరాజు రామయ్య 45వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు.పాడిపంటల అభివృద్ధితో పాటు ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన రామయ్య.. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు స్థానికంగానే అందాలన్న సదుద్దేశంతో ఆనాడు ఈ ఉదార నిర్ణయం త

రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో 'కృత్రిమ కరువు'

- బీఆర్ఎస్ నేతలు బొడ్డు రవీందర్,ఉప్పు రాజ్‌కుమార్
- కాళేశ్వరం పునరుజ్జీవం కోసమే 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర
- అక్టోబర్ 28న మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు యాత్ర

పెద్దపల్లి,అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ,రైతాంగానికి తక్షణమే సాగునీటి విడుదల డిమాండ్‌తో ఈ నెల 28 నుంచి మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర మహా సైకిల్ యాత్రను చేపడుతున్నట్లు బీఆర్ఎస్ గోదావరిఖని పట్టణ అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్,బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ సంయుక్తంగా ప్రకటించారు.శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొడ్డు రవీందర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి దశాబ్దాల తెలంగాణ నీటి గోసను తీర్చారని గుర్తుచేశారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం కేసీఆర్‌పై ఉన్న రాజకీయ అక్కసుతోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చి,రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించిందని మండిపడ్డారు.మేడిగడ్డ వద్ద 80పిల్లర్లలో ఒకటి రెండు పిల్లర్లకు సమస్య వస్తే,చిన్నపాటి గ్రౌటింగ్ లేదా తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే పట్టించుకోవడం లేదని ఆరోపించారు.నిత్యం 20 వేల క్యూసెక్కులకు పైగా గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నా,90–93 మీటర్ల లెవెల్ ఉన్నప్పుడు పంపులు ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రాజెక్టులోని వందల కిలోమీటర్ల టన్నెల్స్, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు అన్నీ సక్రమంగా ఉన్నా,మొత్తం ప్రాజెక్టే పనికిరాదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

10 నియోజకవర్గాల మీదుగా సాగనున్న సైకిల్ యాత్ర

తంలో గోదావరి కన్నీటి గోస పేరుతో 180 కిలోమీటర్ల పాదయాత్ర చేసినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాలేదని బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు రెండో పంట వేసుకోవద్దని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని,రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకుంటూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ 400 కి.మీ.సైకిల్ యాత్రను చేపడుతున్నామని వివరించారు.ఈ యాత్ర అక్టోబర్ 28న మేడిగడ్డ వద్ద ప్రారంభమై దాదాపు 10 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా సాగి కొండపోచమ్మ సాగర్ వద్ద ముగుస్తుందని తెలిపారు.కాళేశ్వరం పునరుజ్జీవం కోసం తాము చేపట్టే ఈ పోరాటానికి తెలంగాణవాదులు, ఉద్యమకారులు, యువత,రైతులు,పాత్రికేయ మిత్రులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాశిపాక వాసు,పల్లె మధు,లక్ష్మణ్ గౌడ్ ముత్యం తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లో రైస్ మిల్లర్లు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- డిఫాల్ట్ రైస్ మిల్లర్ల ఆస్తులను గుర్తించాలి
- గడువులోగా బకాయిలు చెల్లించకపోతే ఆస్తుల జప్తుకు చర్యలు

పెద్దపల్లి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

డిఫాల్ట్ రైస్ మిల్లర్లు తమ పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం 45 రోజుల గడువు కల్పించిందని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు,డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో బకాయిల వసూళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువును డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకొని, తమకు సంబంధించిన పెండింగ్ బకాయిలన్నింటినీ నిర్ణీత గడువులోగా చెల్లించాలని సూచించారు.డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు సంబంధించిన స్థిర, చర ఆస్తుల వివరాలను సబ్ రిజిస్ట్రార్ అధికారులు గుర్తించి, పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించారు.ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువులోగా బకాయిలు చెల్లించని పక్షంలో సంబంధిత రైస్ మిల్లర్ల ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల మేనేజర్ శ్రీకాంత్, సబ్ రిజిస్ట్రార్ అధికారులు, సంబంధిత అధికారులు, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

జగిత్యాల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

25 ఎకరాల్లో నిర్మాణం 25న మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన

జగిత్యాల అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తాటిపల్లి–మొరపల్లి శివారులోని 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు ఈ నెల 25వ తేదీ ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల చేతుల మీదుగా పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ మండల స్థానిక నాయకులతో కలిసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించే సభ ప్రాంగణాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందన్నారు జగిత్యాల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మకమైన ఈ పాఠశాల మంజూరు కావడం సంతోషకరమని 25 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో పాఠశాల ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులు స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు జగిత్యాల జిల్లా నియోజకవర్గ విద్యార్థుల భవిష్యత్తుకు ఈ యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఒక గొప్ప వరంగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి పాక్స్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్ మాజీ జడ్పీటీసీ పెండెం రాములు సర్పంచులు కట్ట రాజేందర్ గంగారెడ్డి ఆనంద్ రెడ్డి తహసీల్దార్ హకీం మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం అసెంబ్లీ యూత్ అధ్యక్షులు భూమా రెడ్డి కౌన్సిలర్ లు తిరుమలయ్య కమల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి పాక్స్ డైరెక్టర్ నీరటి గంగారెడ్డి శ్రీనివాస్ నలువాల సురేష్ తిరుపతి దాసరి సతీష్ నరేష్ మాజీ సర్పంచ్ గంగారం సదానందం టిల్లు ప్రవీణ్ రావు.అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెట్ పల్లి బస్టాండ్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శన

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- బస్టాండ్‌లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

మెట్ పల్లి అక్టోబర్ 23 (వుదయం విలేకరి)

అదనపు బస్ స్టాప్ ఫాంల ఏర్పాటు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతిపత్రం అందజేస్తానని కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల సంజయ్ తెలిపారు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు మెట్పల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రభుత్వ ఆసుపత్రిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం సందర్శించారు ముందుగా మెట్పల్లి బస్టాండ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బస్టాండ్ పరిసరాలను పరిశీలించి అక్కడి పారిశుద్ధ్య నిర్వహణపై ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెట్పల్లి బస్టాండ్ నుంచి ప్రతిరోజూ సుమారు 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని ఇంత పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వచ్చే బస్టాండ్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు ఈ బస్టాండ్ ప్రస్తుతం పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా లేదని అదనపు బస్ ప్లాట్‌ఫాంల ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు ఇట్టి విషయమై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని స్వయంగా కలిసి అదనపు ప్లాట్ ఫాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేస్తానని తెలిపారు బస్టాండ్ లోని మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ప్రయాణికులకు నిరంతరం నీటి సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు తాగునీటి సౌకర్యం ప్రయాణికులు కూర్చునేందుకు తగిన ఏర్పాట్లు బస్టాండ్ ఆవరణలో చెత్త పేరుకుపోకుండా నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు అనంతరం మెట్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే సంజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు ఆసుపత్రిలో మందుల లభ్యత పరిశుభ్రత తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని సందర్శించి పరిశీలించారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోరుట్ల అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

రైతులకు అవసరమైన సేవలను అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి సింగిల్ విండో సహకార సంఘాలు వారధిగా నిలవాలని ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సూచించారు శుక్రవారం కథలపూర్ మండల పరిధిలోనీ భూషణ్ రావు పేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యుల అభినందన సభలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో సంఘాలు రైతులు పండించిన పంటలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేసే ప్రక్రియలో సహకరించాలని సూచించారు వ్యవసాయ సీజన్ లో రైతులకు అవసరమైన ఎరువులు ఇతర వ్యవసాయ సంబంధిత వస్తువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు వారి ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిగా పని చేయాలని సూచించారు సంఘం నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు మేలు చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని రైతును రాజుగా చూడాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు వ్యవసాయాన్ని దండగ నుంచి పండుగగా మార్చాలన్న లక్ష్యంతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు . కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్ లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్ష పాలకవర్గం కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పెద్దపల్లి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం రోజున ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 13.10.2026 నుండి చేపట్టనున్న నిరవధిక ధర్నా కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) పరిధిలో వేలాది మంది ఉద్యోగులు గత అనేక సంవత్సరాలుగా ప్రజలకు నిరంతరాయంగా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, కోవిడ్–19 వంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైతం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా NHM ఉద్యోగులు ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అంకితభావంతో సేవలందించారని, గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలులో NHM ఉద్యోగుల సేవలు అత్యంత కీలకమైనవని వాళ్ల సమస్యలు వెంటనే తీర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి కొమ్ము కొమురయ్య, బుచ్చయ్య, సాయి ఆజాద్, మహేందర్, శ్రీనివాస్ తదితరు పాల్గొన్నారు.

కేశనపల్లిలో భూ భారతి రీసర్వేపై అవగాహన

- భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వమే లక్ష్యం
- ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి

ముత్తారం అక్టోబర్ 23(వుదయం ప్రతినిధి):

మండలంలోని కేశనపల్లి గ్రామంలో భూ భారతి రీసర్వే కార్యక్రమంపై ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు.భూముల రీసర్వే ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం సాధించడంతో పాటు భూ యజమానులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటమే లక్ష్యమని వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి రీసర్వే ప్రక్రియలో భాగంగా భూముల హద్దులను గుర్తించడం,భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించడం,రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని సరిచూసుకోవడం వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి భూ యజమాని తమ భూమికి సంబంధించిన రికార్డులు,పట్టా పాస్‌బుక్‌లో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తెలిపారు. భూమి విస్తీర్ణం,సర్వే నంబరు, హద్దులు తదితర వివరాల్లో ఏవైనా తేడాలు ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూములకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండటం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తే అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నారు. రీసర్వే ప్రక్రియపై రైతులు, భూ యజమానులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని,అధికారులకు అవసరమైన సమాచారాన్ని అందించి సర్వే కార్యక్రమానికి సహకరించాలని కోరారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయడంలో రీసర్వే కీలకమని వివరించారు.గ్రామస్థాయిలో భూ భారతి రీసర్వేపై అవగాహన కల్పించడం ద్వారా భూ యజమానులకు తమ భూముల వివరాలపై స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెగూడ తిరుమల,ఉపసర్పంచ్ సదయ్య, సర్వేయర్లు,సంబంధిత అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ వెనుక త్యాగాలెన్నో..

పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన..

అమరుల సేవలను వివరించిన ఎస్ఐ

వేములవాడ, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి) :

పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని వేములవాడ రూరల్ ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసుల విధులు, చట్టాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, ఫింగర్‌ప్రింట్ పరికరాలు, ట్రాఫిక్ నియంత్రణ పరికరాల పనితీరును వివరించారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును విద్యార్థులకు పరిచయం చేశారు.

చట్టాలను గౌరవించాలి

ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని వివరించారు. విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని పోలీసుల విధులు, భద్రతా వ్యవస్థల గురించి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల విద్యాధికారి కిషన్, ఉపాధ్యాయులు, ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి, రిసెప్షన్ కానిస్టేబుల్ రేఖ, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ రాజశేఖర్, మనోహర్, దేవరాజు, అసిస్టెంట్ రైటర్ లహరిప్రియ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంతి మోహన్ రెడ్డికి సన్మానం

ఇబ్రహింపట్నం అక్టోబర్ 23 (వుదయం విలేకరి)

తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులుగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన కంతి మోహన్ రెడ్డిని తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి ఈ సందర్భంగా కంతి మోహన్ రెడ్డి స్వగ్రామమైన ఇబ్రహింపట్నం లోని కొత్త బస్‌స్టాండ్ ప్రాంతంలో శుక్రవారం తెలంగాణ జనసమితి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామంలోని వివిధ కుల సంఘాల పెద్దల ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కంతి మోహన్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు ఆయనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం పార్టీకి ఇబ్రహింపట్నం ప్రాంతానికి గర్వకారణమని తెలిపారు అనంతరం కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో తెలంగాణ జనసమితి పార్టీ పేదలు రైతులు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కొత్త బాధ్యతను సద్వినియోగం చేసుకుంటూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం రైతుల సంక్షేమం కోసం సామాజిక న్యాయం కోసం మరింత అంకితభావంతో పని చేస్తానని స్పష్టం చేశారు కార్యక్రమంలో తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్ తెలంగాణ జన సమితి పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జిల్లపెల్లి దిలీప్ కుమార్ మండల పార్టీ అధ్యక్షులు కంతి రమేష్,గ్రామ శాఖ అధ్యక్షులు ఏశాల గంగారెడ్డి రెబ్బటి మల్లయ్య యాదవ్ నందగోపాల్ గజ్జ రాజేందర్ కనుక కృష్ణ గంగాధర్ చిన్నయ్య గూడా రాజారెడ్డి కాట దశరథ్ రెడ్డి పెద్దబోయిన రమేష్ గడ్డమీద నరేందర్ బద్ది రాములు కంతి మోసే సంజీవ్ కంతి కరుణాకర్ గజ్జ రాజశేఖర్ ఎండీ సలీం సిరాజ్ కనక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటను సందర్శించిన వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు

పెద్దపల్లి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

పాలకుర్తి మండలంలోని కన్నాల గ్రామ శివారులోని రైతు పుప్పాల దయానంద్ కు చెందిన పామాయిల్ తోటను మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఉద్యాన విస్తరణ అధికారి బోడుకల రాము గార్లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధిక నీరు అవసరమయ్యే వరి పంట సాగును తగ్గించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వరి సాగుకు వినియోగించే నీటితో ఇతర ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ పామ్, కూరగాయలు, అపరాల పంటలైన పెసర, మినుము, బబ్బెర, ఉలవలు, నూనెగింజల పంటలైన నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించేందుకు బిందు సేద్యం, తుంపర సేద్యం పద్ధతులను పాటించాలని, ఇంకుడు గుంతలను నిర్మించడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని సూచించారు.అలాగే రాబోయే కాలంలో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులు వానాకాలం వరి పంట కోత అనంతరం వరి గడ్డిని తగలబెట్టకుండా గడ్డి చుట్టలుగా (Bales) కట్టి నిల్వ చేసుకోవాలని సూచించారు.పచ్చి పశుగ్రాసం కోసం జొన్న, సూపర్ నేపియర్, హెడ్జ్ లూసర్న్, బర్సీమ్, అలసంద, మొక్కజొన్న వంటి పశుగ్రాస పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ఉద్యానవన శాఖ అధికారి బి రాము మరియు పామాయిల్ సాగు రైతులు పుప్పాల దయానంద్, ఎడెల్లి వేణు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా, పింఛన్ పథకాలతో కుటుంబాలకు భరోసా

ముత్తారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

ముత్తారం అక్టోబర్ 23(వుదయం ప్రతినిధి):

సామాజిక భద్రతా పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముత్తారం శాఖ మేనేజర్ వినయ్ సూచించారు. ముత్తారం మండలం హరిపురం గ్రామంలో టిజిబి బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వివిధ బీమా,పింఛన్,పొదుపు పథకాల ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు.ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన,సుకన్య సమృద్ధి యోజన,అటల్ పెన్షన్ యోజన పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.ప్రజలు పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని,అర్హతను బట్టి ప్రభుత్వ పథకాల్లో చేరి ఆర్థిక భద్రత పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెంగని సమత తిరుపతి,బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు స్ఫ

మీ ప్రమాణం ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ 23

జిల్లా కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో ఆఫీస్ సిబ్బందితో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీ ప్రమాణం ఫేషియల్ యాప్ ప్రవేశ పెట్టడం జరిగిందని,. జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం మరియు కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఆదేశానుసారం, ప్రతి ఒక్కరూ మీ ప్రమాణం అటెండెన్స్ వేయాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు ఆదేశించడం జరిగింది.జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది తో మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేసే సిబ్బంది, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ప్రతి ఒక్కరూ 9 గంటలకు ఇన్, 4 గంటలకు సాయంత్రం అవుట్ అటెండెన్స్ ని మీ ప్రమాణం యాప్ లో వేయాలని పేర్కొనడం జరిగింది. అదేవిధంగా ఆఫీస్ సిబ్బంది ఉదయం 10:00 గంటలకు ఇన్ మరియు సాయంత్రం 5 గంటలకు మీ ప్రమాణం యాప్ లో అవుట్ అటెండెన్స్ వేయాలని ఆదేశించడం జరిగింది. ప్రతిరోజు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లు, ప్రోగ్రాం ఆఫీసర్స్,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కూడా అటెండెన్స్ వేస్తూ, సిబ్బంది యొక్క అటెండెన్స్ ని ప్రతిరోజు మానిటర్ చేయాలని కోరడం జరిగింది. మీ ప్రమాణంలో అటెండెన్స్ వేయలేని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోబడతాయని ఆదేశించడం జరిగింది.

సర్కారు బడుల్లోనూ కార్పొరేట్ చదువులు

- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం
- మల్లారంలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది

వేములవాడ రూరల్, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి) :

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తూ, నాణ్యమైన విద్యతోపాటు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 'సేవా సంకల్ప అభియాన్–డిజిటల్ ఎడ్యుకేషన్ అండ్ ఏఐ ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కంప్యూటర్ విద్యతో విద్యార్థులకు భవిష్యత్తులో విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రభుత్వ పాఠశాలల్లో నూతన సిలబస్, మెరుగైన విద్యా ప్రమాణాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచి వారి ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. విద్యతోపాటు నాణ్యమైన పోషకాహారం అందించడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతోందన్నారు.

కొండ్రాపోలులో తెలంగాణ పబ్లిక్ స్కూల్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో రాష్ట్రంలోనూ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గానికి కొండ్రాపోలులో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తీసుకొచ్చామని, అక్కడ సుమారు 1,500 మంది విద్యార్థులకు విద్యనందించే అవకాశం కల్పించామని వివరించారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించినప్పుడు తల్లిదండ్రులు వెల్లడించిన అనుభవాలను ఆయన ప్రస్తావించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేందుకు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో ఆర్థిక భారం తగ్గుతోందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. 1,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు పూర్తయి, అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టే పరిస్థితి రావడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

విద్యతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ముచ్చర్ల ప్రాంతంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు.మల్లారం గ్రామ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో గర్భిణికి విజయవంతంగా శస్త్రచికిత్స ద్వారా ప్రసవం

పెద్దపల్లి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన 30 సంవత్సరాల గర్భిణి ఈరోజు జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లికి చికిత్స నిమిత్తం వచ్చారు.వైద్య పరీక్షలు నిర్వహించి స్కానింగ్ చేయగా, గర్భంలో ఉమ్మనీరు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.అలాగే గర్భస్థ శిశువు మలం విడుదల చేసినట్లు గుర్తించారు. సదరు మహిళ గత నాలుగు నెలలుగా అధిక రక్తపోటుతో బాధపడుతుండటంతో పాటు, గర్భాశయంలో సుమారు 10 సెంటీమీటర్ల పరిమాణంలో ఫైబ్రాయిడ్ కూడా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ క్లిష్టమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ గారి నేతృత్వంలో జాగ్రత్తగా శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా ప్రసవం చేయడం జరిగింది. ప్రస్తుతం తల్లి మరియు శిశువు క్షేమంగా ఉన్నారు. ఈ సందర్భంగా క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా వైద్య సేవలు అందించి తల్లి, శిశువు క్షేమానికి కృషి చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ రవళిక, అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి, నర్సింగ్ సిబ్బంది మరియు ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ గారు అభినందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ గారు మాట్లాడుతూ, జిల్లా ఆసుపత్రి పెద్దపల్లిలో లాపరోస్కోపిక్ సర్జరీలు, లేజర్ చికిత్సలు,ఫిస్టులా చికిత్సలు,యూరాలజీ శస్త్ర చికిత్సలు,ఆర్థోస్కోపీ,కేటరాక్ట్ సర్జరీ మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వంటి అధునాతన వైద్య సేవలు ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు ఈ అధునాతన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఖరీదైన వైద్య చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలోనే నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా పొందాలని డా. కె. శ్రీధర్ గారు కోరారు.

రాజన్న పనులకు డెడ్‌లైన్!

- జాప్యానికి తావివ్వొద్దు.. వేగం పెంచండి!
- అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం
- 80 అడుగుల రహదారి, బద్ది పోచమ్మ ఆలయ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన

వేములవాడ, అక్టోబరు 22 (వుదయం ప్రతినిధి) :

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో జాప్యం సహించేది లేదని, ప్రతి పనికి గడువు విధించి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. పనుల వేగం పెంచడంతోపాటు అవసరమైన చోట కార్మికుల సంఖ్యను పెంచాలని స్పష్టం చేశారు.వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనుల పురోగతిని అడిగి తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దేవాదాయ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఎన్పీడీసీఎల్, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులను అన్ని శాఖలు సమన్వయంతో చేపట్టి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని, కార్మికుల సంఖ్యను పెంచి పనుల్లో పురోగతి సాధించాలని ఆదేశించారు. రాజన్న ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ వంతెన వరకు చేపడుతున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యుత్ టవర్లకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. గుడిచెరువు బండ్ పార్కులో మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణపై మున్సిపల్ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.ఈ పరిశీలనలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో కేవీఎన్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేశ్, తహసీల్దార్ జయంత్, వీటీఏడీఏ, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

హలో శ్రీనివాస్... ఛలో కోరుట్ల!

- శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవానికి సర్వం సిద్ధం
- కోరుట్ల లో అక్టోబర్ 25న తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ 3వ వార్షికోత్సవం

కోరుట్ల అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం కోరుట్ల పట్టణ మెట్పల్లి రోడ్డులో గల జీఎస్ గార్డెన్స్‌లో శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పూట్కూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం జీఎస్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు 2024 లో సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని కరీంనగర్ లోని టీటీడీ కళ్యాణ మండపంలో ద్వితీయ వార్షికోత్సవాన్ని కరీంనగర్ లోని పీవీఆర్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించామని తెలిపారు ప్రస్తుతం తృతీయ (3వ) వార్షికోత్సవాన్ని కోరుట్లలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

మూడేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు

తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ స్థాపించిన నాటి నుంచి గత మూడు సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు తలసేమియా బాధితులకు రక్త సహాయం పర్యావరణ పరిరక్షణ మొక్కల నాటడం సీడ్ బాల్స్ తయారీ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతూ ప్రజల్లో సేవాభావాన్ని సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నామని పూట్కూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు గత వార్షికోత్సవంలో ప్రపంచ రికార్డును సాధించడం సంస్థకు గర్వ కారణమని అన్నారు సేవే లక్ష్యంగా మానవత్వమే మార్గంగా శ్రీనివాసులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా గుర్తింపు తీసుకురావడమే సంస్థ ప్రధాన ఉద్దేశమని వివరించారు

ప్రతి శ్రీనివాసుడు మరో ఇద్దరిని తీసుకురావాలి

ఈ నెల 25న జరిగే తృతీయ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కోరుట్ల శ్రీనివాసుల సలహా మండలి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న శ్రీనివాస మిత్రులందరూ ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ప్రతి శ్రీనివాసుడు తనతో పాటు మరో ఇద్దరు శ్రీనివాసులను తీసుకువచ్చి ఈ ఐక్యతా వేడుకను మరింత విజయవంతం చేయాలని పూట్కూరి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

కార్యక్రమ వివరాలు

శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవం తేదీ 25 అక్టోబర్ 2026 ఆదివారం ఉదయం 9 గంటలకు కోరుట్ల పట్టణ మెట్ పల్లి రోడ్డులో గల జీఎస్ గార్డెన్స్ లో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కోరుట్ల శ్రీనివాసుల సలహా మండలి ప్రతినిధులు సంస్థ సభ్యులు వివిధ ప్రాంతాల శ్రీనివాస మిత్రులు సమన్వయంతో కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు ఈ విలేకరుల సమావేశంలో నీలి శ్రీనివాస్ బెజ్జంకి శ్రీనివాస్ రావు శ్రీరాముల శ్రీనివాస్ బెజ్జరపు శ్రీనివాస్ తూం శ్రీనివాస్ చిలుక శ్రీనివాస్ పోతుగంటి శ్రీనివాస్ సంగ శ్రీనివాస్ బెజ్జారపు శ్రీనివాస్ బాజోజి శ్రీనివాస్ గాంధారి శ్రీనివాస్ కటుకం శ్రీనివాస్ ఉడుత శ్రీనివాస్ శ్రీనివాస్ ఇంద్రాల శ్రీనివాస్ ఒటారి కారి శ్రీనివాస్ బొల్లెపల్లి శ్రీనివాస్ ఫంక్షన్ హాల్ ఓనర్ గంగుల రాజశేఖర్ గౌతమ్ విశిష్ట తొగిటి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

నినాదం.. పేగు బంధం కాదిది... పేరు బంధం

హలో శ్రీనివాస్... ఛలో కోరుట్ల శ్రీనివాసుల ఐక్యతకు సేవాభావానికి ప్రతీకగా నిలిచే ఈ తృతీయ వార్షికోత్సవంలో ప్రతి శ్రీనివాస మిత్రుడు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ కోరుతోంది.

పెద్దపల్లి జిల్లాలో 40 ప్రభుత్వ పాఠశాలల్లో 'మైండ్‌సెట్ ఆఫ్ ఎ మేకర్' కార్యక్రమం

- విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం
- గత ఏడాది 1,800 మందికి పైగా విద్యార్థులకు ఆవిష్కరణలపై అవగాహన
- 1,061కి పైగా ప్రకటనలు, 96కి పైగా ప్రాథమిక నమూనాల రూపకల్పన
- డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్, టీ-వర్క్స్ సంయుక్తంగా కార్యక్రమం అమలు

పెద్దపల్లి, (మంథని) అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)



విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కలిగించడం, సమాజంలో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పరిష్కారాలను కనుగొనే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ (Dream Start Rise Innovation Network), టీ-వర్క్స్ (T-Works) సంయుక్తంగా 'మైండ్‌సెట్ ఆఫ్ ఎ మేకర్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో పెద్దపల్లి జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణల నైపుణ్యాల అభివృద్ధి

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి సృజనాత్మక పరిష్కారాలను రూపొందించేలా ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తోంది. సమస్యల గుర్తింపు, ఆలోచనల అభివృద్ధి, డిజైన్ థింకింగ్, నమూనాల తయారీ (ప్రోటోటైపింగ్) వంటి అంశాలపై ప్రాయోగిక అనుభవాన్ని అందిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, వినూత్నంగా ఆలోచించడం, కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది.

36కి పైగా విద్యాసంస్థలు: ఆవిష్కరణల కార్యక్రమాలను విద్యాసంస్థలకు విస్తరించారు. 1,800 మందికి పైగా విద్యార్థులు: సృజనాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కారం, ఆవిష్కరణలపై అవగాహన పొందారు. 1,061కి పైగా సమస్యా ప్రకటనలు: విద్యార్థులు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సమస్యా ప్రకటనలుగా రూపొందించారు.

96కి పైగా ప్రాథమిక నమూనాలు: కొత్త ఆలోచనలకు తక్కువ ఖర్చుతో ప్రాథమిక రూపాలను అభివృద్ధి చేశారు. 20 ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ నమూనాలు: ప్రతిపాదించిన ఆలోచనల సాధ్యాసాధ్యాలను ప్రాథమికంగా నిరూపించే నమూనాలను రూపొందించారు.

ఈ ఫలితాలు విద్యార్థుల్లో సమస్యలను విశ్లేషించడం, కొత్తగా ఆలోచించడం, ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కార్యక్రమం సాధించిన పురోగతిని తెలియజేస్తున్నాయి. మంథని, పెద్దపల్లి జిల్లా పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు తమ నూతన ఆలోచనలను వ్యక్తపరిచే అవకాశాలను కల్పించడం, స్థానిక సమస్యలకు స్థానికంగానే పరిష్కారాలను కనుగొనేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమంలోని ముఖ్య ఉద్దేశాలు. చిన్న వయస్సు నుంచే సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం, బృందంగా పనిచేయడం, ప్రయోగాత్మక అభ్యాసం వంటి నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా విద్యార్థులను భవిష్యత్తు ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

అన్నదాతను నిండా ముంచిన బయో మందులు

- న్యాయం చేయండి.. లేదంటే ఆత్మహత్యే గతి
- ప్రెస్‌క్లబ్ వేదికగా అన్నదాత రాజయ్య ఆక్రందన

పెద్దపల్లి,అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి)

బయో పురుగుమందుల పిచికారీ వికటించి చేతికొచ్చిన పత్తి పంట సమూలంగా నాశనమైందని,వ్యవసాయ అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం ఇప్పించక పోతే ఆత్మహత్యే శరణ్యమని పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన రైతు కుంటూరి రాజయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన,తన 2 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో సుమారు రూ.2.50 లక్షల మేర అప్పులు చేసి పత్తి సాగు చేయగా, పంటలో దోమ నివారణ కోసం జూలపల్లిలోని శ్రీ రామాంజనేయ పెస్టిసైడ్స్ దుకాణంలో అక్టోబర్ 4న కొనుగోలు చేసిన ఎస్కే రెడ్డి కంపెనీకి చెందిన ప్రెసిడెంట్,వజ్రం బయో మందులను కొనుగోలు చేసి, దుకాణదారు సూచనల మేరకు కలిపి పిచికారీ చేయడంతో చేను మొత్తం ఎర్రబారి మాడిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు.దాదాపు రూ.4 లక్షల వరకు దిగుబడి ఆశించిన తనకు అపార నష్టం వాటిల్లిందని,ఈ విషయమై ప్రశ్నిస్తే అటు డీలర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కంపెనీ ప్రతినిధులు మొదట న్యాయం చేస్తామని చెప్పి ప్రస్తుతం ఫోన్లు కూడా ఎత్తడం లేదని వాపోయారు.ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని రైతు తెలిపారు.అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయాలని,సదరు బయో పెస్టిసైడ్స్ నాణ్యత,బ్యాచ్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తనకు పరిహారం అందేలా చూడటంతో పాటు సంబంధిత కంపెనీ,డీలర్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కుంటూరి రాజయ్య డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలకు గురుదత్త హైస్కూల్ విద్యార్థి ని ప్రజ్ఞ రాజ్ ఎంపిక

ముషీరాబాద్, అక్టోబర్ 23(వుదయం)

హైద్రాబాద్: హన్మకొండకు చెందిన దండుగుల శ్రీ ప్రజ్ఞ రాజ్ జాతీయ స్థాయి అండర్–17 బాలికల క్రికెట్ పోటీలకు తెలంగాణ జట్టు తరఫున ఎంపికైంది. జమ్మూ కాశ్మీర్‌లో నవంబర్ 15 నుంచి 20 వరకు నిర్వహించనున్న 70వ జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య (SGFI) అండర్–17 బాలికల క్రికెట్ పోటీల్లో ప్రజ్ఞ రాజ్ తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ప్రజ్ఞ రాజ్ సిద్దిపేట జిల్లా గజ్వేల్ రూరల్ సర్కిల్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రవిరాజు–సుష్మ దంపతుల కుమార్తె. హైదరాబాద్‌లోని నల్లకుంట గురుదత్త హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఆమె, నగరంలోని నెక్స్‌గన్ (Nexgon) క్రికెట్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతోంది. కుడిచేతి వాటం బ్యాటర్‌గా, లెగ్ స్పిన్ బౌలర్‌గా ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరుస్తూ వివిధ స్థాయిల్లో విజయాలు సాధిస్తోంది.

గతంలోనూ పలు విజయాలు

2025 జనవరిలో యువ క్రీడాకారులను ప్రోత్సహించే YSCL అండర్–14 పోటీల్లో తెలంగాణ జట్టుకు ఎంపికైన ప్రజ్ఞా రాజ్, గత ఏడాది నవంబర్‌లో తెలంగాణ స్కూల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అండర్–16 టీ20 ఇండియా–శ్రీలంక ఫ్రెండ్‌షిప్ కప్‌లో శ్రీలంక జట్టుపై ప్రతిభ కనబరిచి అవార్డు అందుకుంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ –15 మహిళల క్రికెట్ పోటీల్లో నూ ఆమె తన ప్రతిభను చాటుకుంది. 2026 ఫిబ్రవరిలో వరంగల్ లో జరిగిన ఉమ్మడి జిల్లాల సీనియర్ మహిళల క్రికెట్ పోటీల్లో వరంగల్ జట్టు తరఫున పాల్గొని జట్టు ను విజేతగా నిలపడం లో కీలక పాత్ర పోషించింది. గత రెండేళ్లుగా పాఠశాలల క్రీడా సమాఖ్య నిర్వహించిన అండర్–17, అండర్–19 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వరంగల్ జిల్లా తరఫున ఎంపికై మంచి ప్రదర్శన కనబరిచింది.

ఐదు వికెట్లతో సత్తా చాటి జాతీయ జట్టుకు ఎంపిక

ఇటీవల సిరిసిల్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ జిల్లా జట్టు తరఫున ఆడిన ప్రజ్ఞ రాజ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం రెండు ఓవర్లలో ఐదు వికెట్లు పడగొట్టి అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన చేసింది. ఈ టోర్నీలో హైదరాబాద్ జట్టు మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని అందుకుంది. ప్రజ్ఞరాజ్ కనబరిచిన అత్యుత్తమ బౌలింగ్ ప్రతిభ, ఆల్‌రౌండ్ ప్రదర్శన ఆధారంగా తెలంగాణ అండర్–17 బాలికల జట్టుకు ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి జోగిపల్లి రవీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల నవంబర్ 15 నుంచి 20 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున ఆడి రాష్ట్రానికి మరిన్ని విజయాలు అందించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ప్రజ్ఞ రాజ్ సాధించిన విజయాల పట్ల గురుదత్త హైస్కూల్ ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.భవిష్యత్తులోనూ ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష

రైతుబిడ్డ చొరవ.. జనగాం కాల్వకు సాగునీటి పారవశ్యం!

- కోటిపల్లి ప్రాజెక్ట్ జలాలతో చిగురించిన అన్నదాతల ఆశలు
- పారిన సాగునీరు.. తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి శ్రమకు దక్కిన ఫలితం
- ప్రాజెక్ట్ పునరుద్ధరణకు రూ. 89 కోట్ల భారీ నిధుల మంజూరు
- మనోహర్ అన్నకు' ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ అరుణ, జనగాం రైతాంగం

తాండూరు అక్టోబర్ 23(వుదయం ప్రతినిధి)

దశాబ్దాలుగా ఎండిపోయిన చేలకు, అన్నదాతల ఆశలకు మళ్లీ ప్రాణవాయువు లభించింది. తాండూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధి, రైతుల పక్షపాతి ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి తీసుకున్న ప్రత్యేక చొరవతో పెద్దముల్ మండలం జనగాం గ్రామ కెనాల్ కాల్వలోకి కోటిపల్లి ప్రాజెక్టు సాగునీరు విడుదలవుతోంది. కాల్వల ద్వారా పొలాలకు పరుగులు తీస్తున్న సాగునీటిని చూసి రైతాంగం సంతోషంతో ఉప్పొంగిపోతోంది. ఎండిపోతున్న పంటలకు నీరందడంతో అన్నదాతల కళ్లల్లో ఆనంద భాష్పాలు రాలాయి.నిధుల మహా పూర్వకం – రూ. 89 కోట్లతో చారిత్రాత్మక విజయం కోటిపల్లి ప్రాజెక్టును ఆధునీకరించి, నియోజకవర్గం లోని ప్రతి ఎకరానికి నీరందించాలనే పట్టుదలతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రాత్రింబవళ్లు శ్రమించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ప్రాజెక్టు అభివృద్ధి పనులకు గాను ఏకంగా రూ. 89 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని స్థానిక ప్రజలు నినదిస్తున్నారు. తాండూరు ప్రాంత నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి.

నిజమైన 'రైతుబిడ్డ' మనోహర్ అన్న!

తాను కేవలం నాయకుడిని మాత్రమే కాదని, రైతుల కష్టసుఖాలు తెలిసిన 'రైతుబిడ్డనని' ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. పొలాల్లో పారుతున్న నీటిని చూసి సర్పంచ్ అరుణ మరియు గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు. "మా కష్టాలను స్వయంగా తెలుసుకొని, చెప్పిన మాట ప్రకారం కాల్వలకు నీటిని విడుదల చేయించిన మనోహర్ అన్నకు జనగాం గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు. రూ. 89 కోట్లు మంజూరు చేయించి కోటిపల్లి ప్రాజెక్టుకు జీవం పోసిన ఆయన కృషి ఎప్పటికీ మరచిపోలేము. కోటిపల్లి జలాల రాకతో జనగాం గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. రైతులు పరస్పరం తీపి తినిపించుకుంటూ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలుపుతూ ప్రాజెక్ట్ జలాలకు నీరాజనాలు అర్పించారు.

వన మహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):-

వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించిన మొక్కలకు నీరు పోసే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అది ఆరోగ్యంగా పెరిగేలా చూడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ పీఆర్ సురేష్, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ విష్ణు వర్ధన్, ఏఈ ట్రాన్స్ కో సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి సర్పంచ్ కిషన్ యాదవ్ , ఉప సర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

రోళ్లకల్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.10 వేల విరాళం

తండా ఆధ్యాత్మిక అభివృద్ధికి మాధురి నరేష్ చేయూత

పర్వతగిరి , అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం రోళ్లకల్ గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు ముందు తండాలో నిర్మిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ దేవి మంగ్య నాయక్ కుమార్తె, అల్లుడు మాధురి నరేష్ ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఆలయ నిర్మాణ పనులకు తన వంతు సహకారంగా రూ.10,000 విరాళాన్ని తండా పెద్దమనుషుల సమక్షంలో అందజేశారు.

ఆలయ నిర్మాణానికి చేయూత అందించడం అభినందనీయం

తండా ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం భక్తులలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు, తండా ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణానికి మాధురి నరేష్ ముందుకు వచ్చి విరాళం అందించడం పట్ల తండా పెద్దలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలు, బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఆలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణానికి దాతలు ముందుకు రావడం వల్ల సమాజంలో ఐక్యత, భక్తిభావం మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. తండా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ, ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా నిర్మిస్తున్న ఆలయానికి ఆర్థిక సహకారం అందించడం పట్ల మాధురి నరేష్‌ను తండా పెద్దలు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతలు సహకరించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంగ నాయక్, బిలు నాయక్, భూషయ్య, సురేందర్, అనిల్, లస్కర్ తదితరులు పాల్గొన్నారు. తండా పెద్దమనుషుల సమక్షంలో విరాళం అందజేసిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సేవా భావంతో ఆలయ నిర్మాణానికి చేయూత అందించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని స్థానికులు పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ సాధించిన గిరిజన బిడ్డ

జన్నారం, అక్టోబర్ 22 (వుదయం విలేఖరి)

జన్నారం మండలం, రూప్ నాయక్ తండాకు చెందిన అజ్మీరా వెన్నెల ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది.భూక్యా రమేష్ నాయక్ – సునీత మేనకోడలు, స్వర్గీయ అజ్మీరా పున్నం చంద్ – రవిత కుమార్తె అయిన వెన్నెల చిన్నప్పుడే తండ్రిని కోల్పోయింది. తల్లి కూలి పని చేస్తూ కష్టపడి చదివించింది. వెన్నెల 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఎంజేపీ బెల్లంపల్లిలో, ఇంటర్ ఎంజేపీ హైదరాబాద్ లో చదివి, ప్రస్తుతం రిమ్స్ ఆదిలాబాద్ లో ఎంబిబిఎస్ లో ప్రవేశం పొందింది.ఈ సందర్భంగా రూప్ నాయక్ తండా గ్రామ ప్రజలు ఆమె సాధించిన ఈ విజయం తండా ప్రజలకు, యువతకు స్ఫూర్తిదాయకమని, కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని వెన్నెల నిరూపించిందని కొనియాడారు.వైద్య విద్యలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, పేద ప్రజలకు సేవలందిస్తూ మంచి వైద్యురాలిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అజ్మీరా వెన్నెలకు వారు అభినందనలు తెలిపారు.

మాగి పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన వార్తల్లో నిజం లేదు

వ్యక్తిగత కక్షతోనే తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఎంపీడీవోకు గ్రామస్తుల వినతి

నిజాంసాగర్ అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామపంచాయతీ కార్యదర్శిపై ఇటీవల పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శివకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఓ వ్యక్తి వ్యక్తిగత కక్షతో గ్రామపంచాయతీ కార్యదర్శిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వార్తలు ప్రచారం చేయించారని తెలిపారు. సదరు వ్యక్తి అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని, ఆ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలనే ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవాలు లేవని, గ్రామపంచాయతీ కార్యదర్శిపై చేసిన ఆరోపణలను తాము ఖండిస్తున్నామని తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రామంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు వివరించారు. గ్రామాభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణతో పాటు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రాలు, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీ తదితర పంచాయతీ సంబంధిత పనులను సకాలంలో పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో కార్యదర్శి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వ్యక్తిపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. పత్రికలో వచ్చిన వార్తలపై వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివకృష్ణకు అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

112 కాల్‌తో కదిలిన ఖాకీలు

- ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన పర్వతగిరి పోలీసులు
- నూతన సాంకేతికతతో బాధితుడి ఆచూకీ లభ్యం
- సమయస్ఫూర్తి చాటిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు శ్రావణ్, సుందర్
- పోలీసుల తీరుపై ప్రజలు, ఉన్నతాధికారుల ప్రశంసలు

పర్వతగిరి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ పోలీసు విభాగానికి చెంది డయల్ 112 అత్యవసర సేవ మరియు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలగలిసి మరో అమూల్యమైన ప్రాణాన్ని కాపాడాయి. వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని పర్వతగిరి పోలీసులు చాకచక్యంగా రక్షించి, అతని కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చింత నెక్కొండ గ్రామానికి చెందిన మహమ్మద్ భాషా అనే వ్యక్తి వ్యక్తిగత కారణాల వల్ల తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ విషయమై వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు అత్యవసర సమాచారం అందింది.

టెక్నాలజీతో ఆచూకీ గుర్తింపు:

సమాచారం అందుకున్న వెంటనే డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు శ్రావణ్, సుందర్‌లు వెంటనే రంగంలోకి దిగారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం (జియో–లొకేషన్ టెక్నాలజీ) సాయంతో బాధితుడు ఉన్న ప్రాంతాన్ని వేగంగా ట్రాక్ చేసి, అతడి ఆచూకీని కనిపెట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతనికి ధైర్యం చెప్పి, ఆత్మహత్య నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చేశారు.

కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబానికి అప్పగింత:

అనంతరం బాధితుడిని పర్వతగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి, అతని కుమారుడి సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కష్టసమయాల్లో క్షణికావేశంలో ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని, ధైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలని పోలీసులు హితవు పలికారు. అనంతరం అతడిని కుమారునికి అప్పగించారు. సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తిని రక్షించిన పర్వతగిరి పోలీసులను ఉన్నతాధికారులు, స్థానిక గ్రామీణ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

తపాలపూర్ లో కుష్టు వ్యాధి నిర్ధారణపై అవగాహన

జన్నారం,అక్టోబర్ 23 (వుదయం విలేఖరి)

జన్నారం మండలంలోని తపాలాపూర్ గ్రామంలో కుష్టు వ్యాధి నివారణపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ ఆదేశానుసారం శుక్రవారం రోజున ప్రభుత్వ వైద్య సిబ్బంది గ్రామస్తులకు వ్యాధి నిర్ధారణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తిని పరిశీలించి చర్మంపై తెలుపు, ఎరుపు లేదా రాగి రంగు మచ్చలు ఉండి మచ్చలపై స్పర్శ లేకపోవడం, చేతులు కాళ్లు తిమ్మిర్లు, మొద్దుబారిపోవడం, మచ్చపై చెమట పట్టకపోవడం, వెంట్రుకలు రాలిపోవడం, నరాలు లావుగా అవ్వడం వంటి లక్షణాలపై అవగాహన కల్పించారు.హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాధిని నిర్ధారించి ఎం.డి.టి మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ముందుగా వ్యాధిని గుర్తిస్తే వేళ్లు వంగిపోవడం, ముక్కు చదును కావడం, కాలి పుండ్లు, అంగవైకల్యం నుండి కాపాడుకోవచ్చున్నారు.ఈ ఎల్.సి.డి.సి కార్యక్రమం అక్టోబర్ 22 నుండి నవంబర్ 4 వరకు నిర్వహిస్తున్నామని, గ్రామ ప్రజలందరూ వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త లలిత, గ్రామస్తులు ఉన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

- హత్యాయత్నం కేసు నమోదు

జన్నారం,అక్టోబర్ 23 (వుదయం విలేఖరి)

స్నేహితుడి పై హత్యాయత్నానికి ప్రయత్నించిన మరో స్నేహితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జన్నారం ఎస్సై జి.ఉదయ్ కిరణ్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన పోకల వంశీ (19) ను అతని స్నేహితుడైన కామన్‌పల్లి గ్రామానికి చెందిన సాట్ల సాయి శివ (20) ను గత మంగళవారం రాత్రి ఫోన్ చేసి బయటకు రమ్మని పిలిచాడు.రాత్రి సుమారు 11.00 గంటలకు దేవునిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో గతంలో ఒక అమ్మాయి విషయమై జరిగిన వివాదం మరియు తన వ్యక్తిగత విషయాలను ఇతరులకు తెలిపాడనే కోపంతో సాయి శివ, వంశీతో గొడవపడి, బూతులు తిడుతూ చేతులతో కొట్టి, తన వద్ద ఉన్న కీ చైన్ కత్తితో వంశీ కడుపు మరియు పక్కటెముకల వద్ద పొడిచి హత్యాయత్నం చేశాడు.గాయపడిన వంశీని జన్నారంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.బాధితుని తల్లి పోకల కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై ఉదయ్ కిరణ్ వివరించారు.

ఒకరి భూమిపై ఆరుగురి వ్యవహారం

- స్థలం తీసుకుని ఫ్లాట్లుగా విభజించి విక్రయాలకు సన్నాహాలు
- ఒక్కో ఫ్లాట్‌కు ధర 4.50

జైపూర్, అక్టోబర్ 23(వుదయం విలేకరి)

వ్యవస్థలో మార్పు రావాలని చెప్పేవారే వివాదాల్లో చిక్కుకుంటే ఇతరుల తప్పులను ఎత్తిచూపేవారిపైనే ఆరోపణలు వస్తే పరిస్థితి ఏమిటి, జైపూర్ మండలంలోని సాగర్‌రావు బిల్డింగ్ సమీపంలో ఉన్న స్థలానికి సంబంధించి వినిపిస్తున్న ప్రచారం ఇప్పుడు స్థానికంగా చర్చకు దారితీస్తోంది. ఓ వ్యక్తి నుంచి స్థలాన్ని తీసుకున్న ఆరుగురు కలిసి ఫ్లాట్లు ఏర్పాటు చేసి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారనే సమాచారం,వ్యవహారం వెనుక అసలు కథ ఏమిటి కీలకంగా వ్యవహరిస్తున్నదెవరు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఒకరి స్థలం.. ఆరుగురి చేతుల్లోకి

సాగర్‌రావు బిల్డింగ్‌ను ఆనుకుని ఉన్న స్థలాన్ని ఓ వ్యక్తి నుంచి ఆరుగురు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే స్థలాన్ని ఏ ప్రాతిపదికన తీసుకున్నారు కొనుగోలు చేశారా ఒప్పందం కుదుర్చుకున్నారా స్థలానికి సంబంధించిన హక్కులు ఎవరికి ఉన్నాయి అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. స్థల బదలాయింపునకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తేనే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఫ్లాట్లుగా విభజించి అమ్మకాలకు సిద్ధం

సదరు స్థలంలో ఫ్లాట్లు ఏర్పాటు చేసి ఒక్కో ఫ్లాట్‌కు రూ.4.50 లక్షల చొప్పున విక్రయించేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం వినిపిస్తోంది. స్థలానికి సంబంధించిన అనుమతులు ఉన్నాయా నిబంధనల ప్రకారమే విభజన జరిగిందా కొనుగోలుదారులకు ఎలాంటి పత్రాలు అందించనున్నారు, అనే ప్రశ్నలు చర్చకు వస్తున్నాయి. భూమిపై హక్కులు, అనుమతులు స్పష్టంగా నిర్ధారించుకోకుండా కొనుగోళ్లకు ముందుకెళ్లడం ప్రజలకు ఇబ్బందులు తెచ్చే ప్రమాదం ఉంది.

తెరవెనుక వ్యవహారం నడిపిస్తున్నదెవరు

ఆరుగురు కలిసి స్థలాన్ని తీసుకుని ఫ్లాట్లు ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో స్థలాన్ని తీసుకోవడం నుంచి విక్రయాల వరకు కీలక పాత్ర పోషిస్తున్నవారెవరు అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ అంశాలపై పూర్తి వివరాలు బయటకు రావాలంటే సంబంధిత పత్రాలు, లావాదేవీలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించాల్సిన అవసరం ఉంది.సమాజంలోని సమస్యలను ప్రశ్నిస్తూ, అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని చెప్పేవారే ఇలాంటి వివాదాల్లో చిక్కుకున్నారనే ప్రచారం వస్తే ప్రజల్లో అనుమానాలు తలెత్తడం సహజం.

పెద్దమ్మ దేవి అన్నప్రసాదం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మ దేవి అన్నప్రసాదం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని, సాంప్రదాయాలను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కాళ్ళ గంగరాజు, పున్న రాజేశ్వర్, ఉపాధ్యక్షులు చిట్యాల రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నర్సింలు, శేఖర్, ఆశయ్య, రాజు, ముదిరాజ్ సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారానికి బాలు ఎంపిక

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాచే ఢిల్లీలో అందుకోనున్న జాతీయ పురస్కారం

కామారెడ్డి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారం 2026 కు ఎంపిక కావడం జరిగింది. ఈ అవార్డును ఈ నెల 31వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాచే అందుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ పురస్కారానికి అవకాశం కల్పించిన ఐవిఎఫ్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త, ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ లకు, ఐవిఎఫ్ తెలంగాణ విభాగానికి,19 సంపత్సరాలుగా సహకరిస్తున్న రక్తదాతలకు, శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, 2007లో రక్తదాన కార్యక్రమాలను కామారెడ్డి కేంద్రంగా ప్రారంభించి నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని, వ్యక్తిగతంగా 84 సార్లు రక్తదానం, తలసేమియా బాధిత చిన్నారుల కోసం 6,000 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించడం, 350 కి పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 30 వేల యూనిట్ల రక్తాన్ని అందజేసినందుకు, రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలు,సామాజిక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు గాను ఈ పురస్కారం అందుకోవడం జరిగిందని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో తల సేమియా బాధిత చిన్నారుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి వారి ప్రాణాలను కాపాడడం కోసం కృషి చేస్తానని అన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- విద్యార్థులకు విజన్ స్వచ్ఛంద సంస్థ అవగాహన
- మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు నాశనం

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 23 (వుదయం):

విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విజన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించారు.నాగిరెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో చదువుకుని తమ లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విజన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, ఫిర్దోస్, పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమాత ఉత్సవాల్లో వడ్డేపల్లి సుభాష్ రెడ్డి



నాగిరెడ్డిపేట, అక్టోబర్ 23 (వుదయం):

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పరమహంస సచ్చిదానంద శ్రీ శబరిమాత 37వ వార్షికోత్సవంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం పాదుకా పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె సాయిలు, రాకేష్, వెంకటరెడ్డి, దుర్గయ్య, సంగమేశ్వర్, చెన్నంగారి శ్రీనివాస్ రెడ్డి, చందు, దేవేందర్, జైపాల్ రెడ్డి, సంతోష్ పాటిల్, ఆఫీస్ పటేల్, ధనవత్ రాజు, నీల రవి, నిజాం, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతకానీలకు వర్గీకరణలో అన్యాయం...

దండేపల్లి: అక్టోబర్ 23 (వుదయం విలేకరి)

వర్గీకరణలో నేతకానీలకు జరిగిన అన్యాయంపై నేతకానిలా పోరుబాట నవంబర్ 15న "హలో నేతకాని – చలో ఉస్మానియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు,ప్రోగ్రాం కన్వీనర్ సాయిని ప్రసాద్ నేత అన్నారు ఈ సందర్భంగా శుక్రవారం దండేపల్లి ప్రెస్ క్ల

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా లబ్ధి చేకూర్చాలి

రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):-

రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో భాగంగా కొత్తగా ఇళ్లు మంజూరైన అటికెల భూమయ్య, గణేష్‌లకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేదలకు సొంతింటి కల్పనే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు మంజూరైన ఇళ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ పిఆర్ సురేష్, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్ కో సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్ , ఉప సర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు!

మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 23:

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా పత్తిని నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి మెరుగైన ధర పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ల రెండో రోజైన శుక్రవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.9,260 ధర లభించిందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రధాన మార్కెట్లతో పోలిస్తే ఆదిలాబాద్‌లోనే అధిక ధర నమోదైందని పేర్కొన్నారు.

ఇతర మార్కెట్ల కంటే అధిక ధర

ఆదిలాబాద్ మార్కెట్‌లో ప్రైవేటు కొనుగోళ్ల ద్వారా క్వింటాల్ పత్తికి రూ.9,260 ధర లభించగా, జమ్మికుంటలో రూ.9,170, ఖమ్మంలో రూ.9,100, వరంగల్‌లో రూ.9,010 ధర నమోదైనట్లు తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రంలో సీసీఐ ద్వారా క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర లభిస్తోందని పేర్కొన్నారు. రైతులకు ఇతర మార్కెట్ల ధరలపై అవగాహన కల్పించేందుకు మార్కెట్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ధరల వివరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి విట్టల్, మార్కెట్ సూపర్‌వైజర్ స్వామి, అధికారులు, కమీషన్ ఏజెంట్లు, కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు.

వెంకంపల్లి పరిసరాల్లో చిరుత పులి ఆనవాళ్లు!

- **చెక్‌డ్యామ్ వద్ద రెండు పాదముద్రల గుర్తింపు**
- **ఒంటరిగా పొలాలకు వెళ్లొద్దు.. అటవీశాఖ సూచన**
- **పశువులను సురక్షిత ప్రాంతాల్లో కట్టేయాలి: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వాసుదేవ్**

నాగిరెడ్డిపేట,అక్టోబర్ 23 (వుదయం):

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామ పరిసరాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వాసుదేవ్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది గ్రామ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. చిరుత సంచరించినట్లు భావిస్తున్న ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించి, దాని మలం, పాద ముద్రల కోసం పరిశీలించారు. ఈ క్రమంలో చెక్‌డ్యామ్ పరిసర ప్రాంతాల్లో రెండు పాదముద్రలు కనిపించినట్లు అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో వెంకంపల్లి గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. రైతులు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని, ముఖ్యంగా ఊరి బయట గుట్ట సమీపంలో కట్టేసిన పశువులను అక్కడి నుంచి వేరే సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు. గ్రామ ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని సర్పంచ్‌కు అధికారులు సూచనలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో అటవీశాఖ సిబ్బంది, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శారదాదేవి మండపాల్లో బండారి అనూష పూజలు

వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారికి ప్రార్థన

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 23:

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ శుక్రవారం పట్టణంలోని పలు శారదాదేవి మండపాలను సందర్శించారు. శాంతినగర్, కుమార్‌పేట్, ద్వారకానగర్, భుక్తాపూర్ తదితర కాలనీల్లో అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలని, పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.

శాలిపేట గేట్ వద్ద లారీ ఢీ.. పోచారం యువకుడు మృతి

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 23 (వుదయం):

మెదక్ జిల్లా శాలిపేట గేట్ మూలమలుపు వద్ద ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామానికి చెందిన సాయిచరణ్ గౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందారు. హైదరాబాద్‌లోని సురక్ష ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన అక్టోబర్ 23న తెల్లవారు జామున మృతి చెందినట్లు తండ్రి శ్రీనివాస్ గౌడ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం.. అక్టోబర్ 22న పని నిమిత్తం మెదక్‌కు వెళ్లిన సాయిచరణ్ గౌడ్, తిరుగు ప్రయాణంలో పోచారం గ్రామానికి చెందిన ఆటో (TS17U 1394)లో వస్తుండగా శాలిపేట గేట్ మూలమలుపు వద్ద మెదక్ వైపు వెళ్తున్న లారీ (TN52F 6329) ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిచరణ్ గౌడ్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరికొందరు గాయపడ్డారు. ఆటో డ్రైవర్ ఉదయ్ కిరణ్ గౌడ్ ఫోన్ ద్వారా ప్రమాద సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని సురక్ష ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయిచరణ్ గౌడ్ మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. మృతుడికి ఒక తమ్ముడు ఉన్నాడు. తండ్రి శ్రీనివాస్ గౌడ్ పెయింటర్‌గా, కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ హవేలి ఘనపూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు వివరాలు, ఇతర క్షతగాత్రుల పరిస్థితిపై పోలీసుల నుంచి పూర్తి సమాచారం అందాల్సి ఉంది.

వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం అధికారులను నిలదీసిన సర్పంచ్ లు

దండేపల్లి: అక్టోబర్ 23 (వుదయం విలేకరి)

పలు సమస్యలపై అధికారులను మండలంలోని సర్పంచ్ లు నిలదీశారు.దండేపల్లి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో విద్యుత్ శాఖ అధికారి బాపును విద్యుత్ సమస్యలపై,సర్పంచులు ఇప్ప రవళి, చిలుకూరి మహేష్, కుడిమెత తిరుపతి లు నిలదీశారు,అనంతరం, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ,ఎల్నినో ప్రభావంతో నీటి సమస్యలు ఏర్పడుతున్నందున రైతులు యాసంగి వరి సాగుచేయకుండా అంతర్గత పంటలపై మొగ్గు చూపాలని అన్నారు.వర్షాకాలం రైతులు పండించిన పంటలకు ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ,శాఖ పరంగా మండలంలో ఏదైనా సమస్యలు ఉంటే వాట్సప్ ద్వారా తెలిపినా తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దుర్గ ప్రసాద్,తహశీల్దార్ రోహిత్ దేస్పాండే,ఎంపీడీఓ జాగర్లమూడి ప్రసాద్,లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్,అక్కల వెంకటేశ్వర్లు,నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచ్ లు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ. 10,116 విరాళం

దండేపల్లి: అక్టోబర్ 23 (వుదయం విలేకరి)

నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవాసమైన గోండుగూడలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయం కోసం మాజీ సర్పంచ్ గాండ్ల శంకరవ్వ పెద్ద వెంకన్న 10116 విరాళం అందించారు ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గాండ్ల సత్యనారాయణ,ఉప సర్పంచ్ గాండ్ల అశోక్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ మంతెన నవీన్,మాజీ వార్డ్ సభ్యులు గాజుల శేఖర్, గ్రామస్తులు కుర్సింగ్ రాజు, కమలాకర్,దుబ్బ రాజం, కోటేష్,బొజ్జ రావు,సతీష్ పాల్గొన్నారు.

R.V. DIGITAL SOLUTIONS Pvt. Ltd.

KONICA MINOLTA
Authorised Distributor

TONER FREE

- Colour Copiers
- B/W Digital Copiers
- Sales & Service
- Rentals
- Consumables
- Spares

#2-1-390/B/1, Sri Nilayam, Opp. Fever Hospital, Nallakunta, Hyderabad -44
Ph: +91 73311 82569, 98493 03489, Email: rvkm2016@gmail.com